# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

4.2.2026 బుధవారం Wednesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 206 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









# కూలి'పోయిన' బతుకులు!

## మొగిలిపేట శివారులో ఘోర ప్రమాదం


- అక్కడికక్కడే నలుగురు వ్యవసాయ కూలీలు మృతి
- నీటి గుంతలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- అతి వేగం, నిర్లక్ష్యమే కారణమని పోలీసులు నిర్ధారణ
- పరారీలో డ్రైవర్ ఎర్రం శెట్టి గంగాధర్ గాలింపు చర్యలు

5

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండలంలోని మొగిలిపేట గ్రామ శివారులో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పని ముగించుకుని వస్తుండగా ప్రమాదం జరిగింది.





చట్టాలను పాటించకపోతే..

# దేశం నుంచి వెళ్లిపోండి

## దేశ గోప్యతను అడ్డుకోలేరు

- వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ
- మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం

4

# 'పంచాయతీ' ఫలితాలే రిపీట్ కావాలి

- 90% స్థానాలే లక్ష్యం
- అసంతృప్త నేతలను బుజ్జగించండి..
- క్షేత్రస్థాయికి వెళ్లండి
- మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటినట్లే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని తన కేబినెట్ సహచర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.



**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** హైదరాబాద్‌లో తన కేబినెట్ మంత్రులతో సీఎం రేవంత్ మంగళవారం సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని వారికి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే నివేదికలు అందజేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలువబోతున్నామని జోస్యం చెప్పారు సీఎం రేవంత్. అయినా ఎన్నికల చివరి వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. ఇంకా ఎవరైనా రెబల్స్ ఉంటే.. వారిని రాజీ చేయాలని ఆదేశించారు. మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సూచించారు.

మిగతా 2 లో



## వరంగల్ జూలో తెల్లపులి మృతి

వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

.. వివరాలు 2లో



గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు

## నో అబ్జెక్షన్

- సుప్రీంకోర్టు స్పష్టత

.. వివరాలు 2లో




విజయ డయాగ్నస్టిక్‌కు

## జరిమానా

గర్భిణికి ఎన్‌టీ స్కాన్‌లో తప్పుడు రిపోర్టు

.. వివరాలు 2లో



రెండోరోజూ ఉభయసభల్లో

# గందరగోళం

- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు
- లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా

4

# రైతులతో తుమ్మల ముఖాముఖి

- రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి
- యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు
- ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన నాగేశ్వరరావు

2

తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'రైతు నేస్తం' కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.



# మేడారం జాతర సక్సెస్



3

- ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం
- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి సీతక్క



# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

- వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు
- సీఎస్ రామకృష్ణారావు

2

రేవంత్‌ను చూసి యువత

# ఛీ కొడుతోంది

- నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది
- తొలిఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ
- ఎక్స్ వేదిగా కేటీఆర్ విమర్శలు

3





## 'పంచాయతీ' ఫలితాలే రిపీట్ కావాలి

మొదటి పేజీ తరువాయి

అలాగే సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను ఈ సందర్భంగా మంత్రులకు ఆయన సోదాహరణగా వివరించారు. అదే విధంగా జిల్లాల పర్యటన వివరాలను మంత్రులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా ఇంఛార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారి రిపోర్ట్ తనకు అందించాలని ఈ సందర్భంగా మంత్రులకు స్పష్టం చేశారు. ఇక అసంతృప్తి నేతలను బుజ్జగించాలని మంత్రులకు సీఎం రేవంత్ సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలతోపాటు పలు మున్సిపల్ కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. నామినేషన్ల విత్ డ్రా సైతం నేటితో ముగిసింది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 13వ తేదీన వెలువడనున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్షాలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పటికే ఎవరికి వారు రంగంలోకి దిగి తమ సత్తా చాటేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి.

## వరంగల్ జూలో తెల్లపులి మృతి

**వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు**

**వరంగల్, ఫిబ్రవరి 3:** నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

## నేడు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** వెనుకబడిన తరగతుల సమగ్ర అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల నుండి బీసీ కమిషన్ సమాచార సేకరణ చేస్తుంది. ఇందులో భాగంగా విద్యా సంబంధిత విషయంలో సమాచార సేకరణ కొరకై సంబంధిత విభాగ అధిపతులతో రేపు కమిషన్ భేటి కానుంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు జరిగే సమావేశంలో విద్యాశాఖకు చెందిన వివిధ విభాగ అధిపతులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చర్చించనుంది.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు నో అబ్జెక్షన్: సుప్రీం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

## విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌కు భారీ జరిమానా

**గర్భిణికి ఎన్‌టీ స్కాన్‌లో తప్పుడు రిపోర్టు**




**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** తప్పుడు రిపోర్టులు ఇచ్చిన విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వినియోగదారుల హక్కుల కమిషన్ భారీ జరిమాన విధించింది. హైదరాబాద్‌లోని దిల్‌స-ుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన భార్గవి అనే గర్భిణి, తన గైనకాలజిస్ట్ సూచన మేరకు ఎన్‌టీ స్కాన్ కోసం స్థానిక విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆశ్రయించింది. అయితే పరీక్ష అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి అంతా సాధారణంగానే ఉందని సదరు సెంటర్ సిబ్బంది రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చిన భార్గవి మరో డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తిరిగి పరీక్ష చేయించుకోగా షాకింగ్ నిజం వెలుగులోకి వచ్చింది. కడుపులోని శిశువు మెడపై సుమారు 11 ఎంఎం మేర సిస్ట్ (గడ్డ) ఉన్నట్లు రెండో రిపోర్టులో తేలింది. దీంతో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ ఇచ్చిన తప్పుడు రిపోర్టును నమ్మి ఉంటే తల్లీబిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు, వైద్యుల సలహా మేరకు తన గర్భాన్ని తొలగించుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తనకు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమె వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కమిషన్, విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వైఖరిలో స్పష్టమైన నిర్లక్ష్యం ఉందని నిర్ధారించింది. దీంతో బాధితురాలికి కలిగిన మానసిక వేదనకు గానూ రూ. 2 లక్షల పరిహారం, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు, పరీక్ష ఫీజు రూ. 1,700 తక్షణమే చెల్లించాలని సదరు యాజమాన్యాన్ని ఆదేశిస్తూ కీలక తీర్పునిచ్చింది.

# రైతులతో తుమ్మల ముఖాముఖి

- రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి
- యూరియా యాప్ పై సంతృప్తి వ్యక్తం చేసిన రైతులు
- తేనెటీగల పెంపకంతో అధికాదాయము పొందుతున్న రైతులు
- ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను అభినందించిన మంత్రి

**హైదరాబాద్,ఫిబ్రవరి 3:** రైతుల అవసరాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో అంశం నిర్ణయించి, , దానికి తగ్గ రైతు అనుభవాలు, పొలాల నుండి ప్రత్యక్షంగా రైతులు వాటిని చూసేటట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులతో ముఖాముఖి ముచ్చటించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు తమ వ్యవసాయ అనుభవాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల వల్ల పొందుతున్న ప్రయోజనాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా రైతు శివ సమగ్ర వ్యవసాయం మరియు ప్రకృతి వ్యవసాయం అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే ఇఫ్కో కంపెనీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపా శంకర్ నానో యూరియా వినియోగం, దాని ప్రయోజనాలు, సరైన వాడక విధానంపై రైతులకు సమగ్రంగా వివరించారు. పీజేటీఎస్ఏయూ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్ బాబు , డాక్టర్ అరుణశ్రీ యాసంగి వరిలో వచ్చే పురుగులు, తెగుళ్ల,వాటి సమర్థవంతమైన యాజమాన్యంపై రైతులకు శాస్త్రీయంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా యూరియా యాప్ అమలుపై మంత్రి స్వయంగా రైతులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. యాప్ ద్వారా ఎరువుల సరఫరా పారదర్శకంగా, సులభంగా జరుగుతుండటంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూరియా లభ్యత, సమయానికి సరఫరా వంటి అంశాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు తెలిపారు. తేనెటీగల పెంపకం చేస్తూ అధిక ఆదాయం సాధిస్తున్న జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణని, అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా లాభాలు పొందుతున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన రైతు శివని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి వినూత్న వ్యవసాయ విధానాలను మరింత మంది రైతులు అనుసరించేలా అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన కంది కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని, మధ్యవర్తుల బెడద తగ్గిందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతుల అవసరాల మేరకు అంశాలను ముందుగానే నిర్ణయించాలని అధికారులకు సూచించారు. నిర్ణయించిన అంశాలకు అనుగుణంగా రైతుల అనుభవాలు, విజయగాథలను క్షేత్రస్థాయిలో పొలాల నుంచే ప్రత్యక్షంగా ఇతర రైతులు చూసేలా



ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతున్న తీరును, రైతులకు చేరువయ్యేలా అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. అదే సమయంలో రైతుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి, ఎక్కువ సంఖ్యలో రైతులు పాల్గొనేలా ముందస్తు ప్రచారం, సమన్వయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు రైతు నేస్తం వేదిక మరింత బలోపేతం కావాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

**వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు**

**అధికారులతో సీఎస్ రామకృష్ణారావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సీఎస్ఎస్ కింద 5లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్‌లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో



భాగంగా వరంగల్‌లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్లు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

# మేడారం జాతర విజయవంతం

- ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం
- ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క

**హైదరాబాద్,ఫిబ్రవరి 3 :** ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంత మైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ



మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలకు మించి జరిగిందని మంత్రి తెలిపారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో 'తిరుగు జాతర' నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు. జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చేవారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు.ఇది తన మూలాలకు, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల గురించి ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## మరోమారు ఝలక్

**తగ్గినట్లే తగ్గి పెరిగిన బంగారం, వెండి రేట్లు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.



# రేవంత్‌ను చూసి యువత ఛీ కొడుతోంది

- నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది
- తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీకి చెల్లుచీటీ
- ఎక్స్ వేదిగా కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని అన్నారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి యువత ఛీకొడుతోందని ఆయన పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలని హామీ అని చెప్పి... ఇప్పుడు ఐదేళ్ల హామీ అంటూ మాటమార్చారంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో మాజీ మంత్రి కేటీఆర్ పోస్టు చేశారు. మరో గ్యారెంటీ నుంచి నిస్సిగ్గుగా ముఖం చాటేసిన ముఖ్యమంత్రిని చూసి తెలంగాణ నిరుద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందన్నారు. 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని తన నిజస్వరూపాన్ని బయటపెట్టిన రేవంత్ సర్కారుకు నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయమని హెచ్చరించారు. చైతన్యానికి ప్రతీకైన తెలంగాణ యువత సంఘటిత శక్తిలో ఉన్న బలం ఏంటో, వారు బిగించే పిడికిళ్లు కాంగ్రెస్ పునాదులను ఎలా పెకిలిస్తాయో త్వరలోనే చూస్తామని మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అడ్డదారిలో రేవంత్ గద్దె ఎక్కారన్నారు. ఇప్పుడు అది ఐదేళ్ల హామీ అని, పీసీసీ చీఫ్‌తో సీఎం పలికిస్తున్న చిలుక పలుకులు చూసి యువతరం ఛీకొడుతోందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి సీఎం ఫోటోలకు ఫోజు కొట్టారన్నారు. ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో తెలంగాణలో 'రిక్రూట్‌మెంట్ జీరో'గా మారిపోయిందని మాజీ మంత్రి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేసి, వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం నిత్యం గమనిస్తోందని మాజీ మంత్రి చెప్పారు. తెలంగాణ నిరుద్యోగులను నమ్మించి నయవంచన చేసినందుకు సీఎం ముక్కునేలకు రాసి క్షమాపణలు చెప్పినా క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవంతో బతికిన రైతన్నను మళ్లీ అప్పులపాలు చేసి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేళ్లయినా ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. ఆరు గ్యారెంటీలన్నీ అక్షరాలా గారడీలేనని వ్యాఖ్యలు చేశారు.

# కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం

హైదరాబాద్, ఫిబ్రవరి 3: కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదు. కనీస సంస్కారం రాలేదు. చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. హైదరాబాద్‌లో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే, అదే వేదికపై రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని హరీష్ రావు ధ్వజమెత్తారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియక ముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారు. విద్వేష రాజకీయాలకు, నరంలేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతి పితనే. రేవంత్ రెడ్డినాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుందన్నారు. ఉద్యమకారుల పైకి తుపాకి ఎక్కుపెట్టిన



## రేవంత్ రెడ్డి విమర్శలపై మండిపడ్డ హరీష్ రావు

నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి అని హరీష్ రావు ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అని ఘాటు విమర్శలు చేశారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి అన్నారు. లక్కీ లాటరీలో ముఖ్యమంత్రి అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి..? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి..? నువ్వు అమెరికాలోని హార్వర్డ్ వెళ్లినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టమైందని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

# తెలంగాణలో దడ పుట్టిస్తున్న టైఫాయిడ్

**202 మరణాలతో తెలంగాణ రెండో స్థానం**


**దేశ వ్యాప్తంగా మొత్తం 1,075 మంది మృతి**




**హైదరాబాద్,ఫిబ్రవరి 3:** టైఫాయిడ్ మరణాల్లో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉండటం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. దేశంలో టైఫాయిడ్‌తో ప్రాణాలు విడిచే ప్రతీ ఐదుగురిలో ఒకరు తెలంగాణకు చెందిన వారు అని ఆ నివేదిక వెల్లడించింది. 2023లో దేశంలో మొత్తం 1,075 మంది టైఫాయిడ్ కారణంగా చనిపోగా.. అందులో 202 మరణాలు ఒక్క తెలంగాణలోనే నమోదయ్యాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా టైఫాయిడ్‌కు సంబంధించిన గణాంకాలు.. తెలంగాణను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశంలో నమోదు అవుతున్న ప్రతీ 5 మరణాల్లో ఒకటి తెలంగాణ నుంచే ఉందని తాజాగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్ వెల్లడించడం తీవ్ర కలకలం రేపుతోంది. 2023లో టైఫాయిడ్ బారినపడి 202 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దేశంలోని అన్ని టైఫాయిడ్ మరణాల్లో 19 శాతం తెలంగాణ నుంచి ఉన్నట్లు ఆ రిపోర్ట్ చెబుతోంది. టైఫాయిడ్ వ్యాప్తికి ప్రధాన కారణాలు.. కలుషితమైన ఆహారం, నీరు, పారిశుద్ధ్య సమస్యలు అని నిపుణులు చెబుతున్నారు. అయితే టైఫాయిడ్ బారిన పడ్డ వారికి.. చికిత్సలో ఆలస్యం చేయడం వల్ల పేగులు దెబ్బతినడం వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. 2023కు సంబంధించి రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్ రిపోర్ట్ ప్రకారం.. మన దేశంలో టైఫాయిడ్, పారాటైఫాయిడ్ కారణంగా మొత్తం 1,075 మరణాలు నమోదైనట్లు తెలుస్తోంది. ఇక భారతదేశంలోనే రెండో అత్యధికంగా 202 మరణాలతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఇక 377 మరణాలతో మొదటి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్ ఉంది. అయితే దేశంలోని జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.5 శాతం మాత్రమే కాగా.. టైఫాయిడ్ సంబంధిత మరణాల్లో మాత్రం 19 శాతం వాటాను కలిగి ఉండటం.. రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుపుతోంది. మూడో స్థానంలో 118 మరణాలతో పంజాబ్.. 36 మరణాలతో ఢిల్లీ నాలుగో స్థానాల్లో నిలిచాయి. సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ సోకుతుంది. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అపరిశుభ్రమైన నీరు.. పైపులైన్లు వేసేటపుడు, మరమ్మతుల సమయంలో అందులో మురుగునీరు కలిస్తే.. వాటిని తాగడం వల్ల ఈ టైఫాయిడ్ విస్తృతంగా వ్యాప్తి చెందుతోంది. పరిశుభ్రత లేకుండా తయారు చేసే స్ట్రీట్ ఫుడ్, దాని తయారీలో ఉపయోగించే కలుషితమైన నీటిని వాడటం వల్ల.. ఎక్కువగా ఈ టైఫాయిడ్ బారిన పడుతున్నారు. నగరాల్లో నాలాలు, రోడ్లపై మురుగునీరు పొర్లడం, మురికివాడల్లో వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల ఈ సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా అతి వేగంగా వ్యాప్తి చెందుతుంది. అయితే టైఫాయిడ్ సోకిన చాలామంది.. దాన్ని ఒక సాధారణ జ్వరం అని భావించి నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సొంతంగా మెడిసిన్ వేసుకుని తగ్గించుకుందామనే ప్రయత్నం చేస్తారు. కానీ ఇలాంటి నిర్ణయాల వల్లే వారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదికి తెస్తోందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోకపోతే.. ఈ టైఫాయిడ్ వల్ల పేగులకు రంధ్రాలు పడటం, రక్తంలో ఇన్ఫెక్షన్ రావడం, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సరైన సమయంలో సరైన మెడిసిన్ వాడకపోవడం, సాధారణ యాంటీబయాటిక్స్ పని చేయకపోవడం టైఫాయిడ్ రోగులకు మరో పెద్ద సవాలుగా మారిందని డాక్టర్లు తెలిపారు. నిపుణుల సూచించిన వివరాల ప్రకారం.. నీటిని కాచి చల్లార్చి తాగడం.. వేడి వేడి ఆహారాన్ని తినడం, జ్వరం వచ్చిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించి సరైన సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల మరణాలను అరికట్టవచ్చని చెబుతున్నారు. టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అక్కడ పారిశుద్ధ్య చర్యలను పూర్తిగా చేపట్టాలని సూచిస్తున్నారు.










# సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్

**ఉచితాలను ప్రకటించడానికి కాదు ● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 3:** ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్ లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# జీవన్ రెడ్డి వర్గీయులకు మొండిచేయి

**జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ అనుచరులకు పెద్దపీట**

**కాంగ్రెస్ తీరుతో మరోమారు తీవ్ర అసంతృప్తిలో జీవన్ రెడ్డి**



**జగిత్యాల, ఫిబ్రవరి 3:** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ టికెట్ల కేటాయింపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కనుసన్నల్లోనే కేటాయించారు. ఆయన సూచించిన వారికే టిక్కెట్లు దక్కాయి. దీంతో కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి మోమారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సీట్ల పంపకంలో.. తన గొంతు కోశారని, కాంగ్రెస్ అధిష్ఠానం తన వర్గానికి న్యాయం చేయలేదని అనుచరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే ఎం.సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించి నట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. మరోవైపు ఏడాదిన్నర కాలంగా సంజయ్ కుమార్, జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనే ఘాటుగా విమర్శించారు. ఇప్పుడు టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపులో జీవన్ రెడ్డి రియాక్షన్‌పై జిల్లాలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ వద్ద భద్రతా ఏర్పాట్లు పెంచారు పోలీసులు. కాంగ్రెస్ పార్టీలో జీవన్ రెడ్డి భవిష్యత్తు క్లైమాక్స్‌కు చేరుకుందనే చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి.

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం : మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్, ఫిబ్రవరి 3:** గత ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా కల్పించందని అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు కట్టిస్తామని అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లిలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ పట్టణం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ గెలిస్తేనూ పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు. బిఆర్ఎస్ బిజెపిల వ్లల ఒరిగేదేమీ లేదన్నారు. వారికి ఓటేసినా దండగేనని అన్నారు. ఈయన వెంట సహకార సంఘం మాజీ ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాయికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న తమను కాదని పార్టీ కండువా కప్పుకోకుండా ఉన్న నూతన అభ్యర్థులకు బీఫారాలు ప్రకటించడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు తాటిపాముల మమత, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్ రెండవ వార్డ్ అభ్యర్థిగా ప్రకటించగా అతను పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.




TGTEL/25/A1737 | NETI SAKSHI



సంపాదకీయం

# ఏపీలో కల్తీ నెయ్యి మంటలు!

తిరుమల కల్తీ నెయ్యి రాజకీయంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. విమర్శలు, ప్రతి విమర్శలు కాస్తా దాడుల వరకు పోయాయి. పరస్పర విమర్శలు కూడా హద్దులు దాటాయి. ఇళ్లను తగులబెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం వంటి దారుణాలు చూస్తున్నాం. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటివి చూశాం. ఇప్పుడు చంద్రబాబు పాలనలోనూ ఇలాంటివి చోటు చేసుకోవడం సిగ్గుచేటు. రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినా ఫరవాలేదు. కానీ దాడులకు తెగించడం మాత్రం సరికాదు. జోగిరమేశ్ ఇంటిపై పెట్రో బాంబు విసిరి తగులబెట్టే యత్నం చేయడం వాంఛనీయం కాదు. అలాగే అంబటి రాంబాబు ఇంటిపైనా దాడిచేసి కారును, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. గతంలో నెల్లూరు జిల్లాలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపైనా దాడికి తెగించారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో వాంఛనీయం కాదు. ఇలాంటి దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో కూటమి నేతలు చెప్పాలి. ఓ రకంగా చెప్పాలంటే తిరుమల లడ్డూకు సంబంధించి కల్తీనెయ్యి సరఫరా వ్యవహారంలో తాజాగా సిబిఐ ఇచ్చిన నివేదక ఆజ్యం పోసిందని చెప్పాలి. కల్తీ జరగలేదని సిబిఐ చెప్పినట్లుగా వైసిపి నేతలు చేస్తున్న ప్రచారం కూడా పరాకాష్టకు చేరింది. తిరుమల దేవదేవుడిని మోసం చేయడంలో అందరూ ముందున్నారు. తిరుమల శ్రీవారిని దోచుకునేందుకు అందరూ ప్రయత్నించారు. దేవుడి డబ్బుపై కన్ను పడిన వైకాపా అక్కడ చేయని ఘోరం లేదు. ఇకపోతే కల్తీనెయ్యిపై విచారణ సాగుతోంది. సిట్ అన్నింటిని పరిగణించి దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఇవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కూడా బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో పరస్పర దూషణలు, దాడుల వరకూ వెళుతున్న తీరు మాత్రం సభ్యసమాజం సిగ్గుపేడేలా చేసింది. అసలు కల్తీ తీవ్రతపైన సిబిఐ వెల్లడించిన విస్తృతాంశాలను వదిలేసి ఒక్క అంశమే తీసుకుని తాము నిర్దోషులమని చెప్పుకోవడానికి వైసిపి నేతలు రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిందని చెప్పాలి. అలాగే మాజీ సిఎం జగన్ కూడా తిరుమల వ్యవహారాన్ని చాలా చిన్నదిగా చేసి మాట్లాడిన తీరు కూడా సగటు భక్తుడి మనోభావాన్ని దెబ్బతీసింది. ఈ రెండు పార్టీల కుమ్ములాటల్లో ప్రజాసమస్యలన్నీ పక్కదోవ పట్టడం రోజూ చూస్తున్నాం. రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇది సహజంగా మారింది. కానీ కల్తీ నెయ్యి అంశం మాత్రం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నది నిజం. వేలకోట్లకు అధిపతిగా ఉన్న దేవదేవుడి లడ్డూ ప్రసాందం కల్తీనెయ్యితో తయార య్యిందన్న వార్త ఇప్పటికీ జీర్ణించుకోలేనిదిగా మారింది. గతంలో ఆనాటి ప్రధానార్చకులు రమణదీక్షితులు పింక్ డైమండ్లు మాయం అయ్యాయని అన్నారు. ఆలయ భూములు, పూజా పద్ధతులు, నియామకాలతో సహా చాలా సమస్యలు వివాదం అయ్యాయి. వైకాపా హయాంలో తిరుమల పవిత్రతను దెబ్బతీయడం వంటి ఆరోపణలు ముందుకొచ్చాయి. 2024 మేలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారి తిరుమల సందర్శనలోనే అన్నీ ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్యామలరావును నియమించారు. ఆ తరవాత తిరుమల లడ్డూ కోసం ఉపయోగించే నెయ్యిలో 'జంతువుల కొవ్వును వాడే పరిస్థితికి వచ్చారని' ఆరోపించడంతో దుమారం చెలరేగింది. జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసినట్టు తేలిందని ప్రకటించడమేగాక టిటిడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై ప్రభుత్వం సిట్‌ను నియమించడం, నెలాఖరుకల్లా సిట్ రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టడం జరిగిపోయాయి. ఈ క్రమంలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చంద్రబాబు నియమించిన సిట్‌తో కాకుండా సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఏ దర్యాప్తు లేకుండా లడ్డూలో కొవ్వు కలిసిందని ఆరోపించి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేమిటని తీవ్రంగా ఆక్షేపించింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని హితవు చెప్పింది. సిబిఐ మొత్తం 12 రాష్ట్రాల్లో అనేక మందిని విచారించింది. ఛార్జిషీటులో 36 మందిని నిందితులుగా పేర్కొంది. ఉత్తరాఖండ్‌లోని భోలే బాబా డెయిరీ నడిపే విపిన్ జైన్, పోమిల్ జైన్‌లను ప్రధాన కారకులుగా తేల్చింది. మొత్తం మీద రాజకీయంగా పాలక పార్టీలు ఏవైనా కొండ మీద అవినీతి సాగుతున్నదని దీన్నిబట్టి తెలుస్తున్నది. నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, అసలది నెయ్యి కాదని తేల్చి చెబుతూనే కొవ్వు కలిపారనడానికి ఆధారం లేదని సిబిఐ నిర్ధారించడంతో యుద్ధం మొదలయ్యింది. తాము పరిశీలించిన నమూనాలలో నిజమైన నెయ్యి చాలా తక్కువగా వుందనీ, పామాయిల్, పామ్‌స్టెరైన్, ఇతర కృత్రిమ పదార్థాలు రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. కొవ్వు కలిపినట్టు చెప్పే అవకాశాలు దాదాపు లేవని, పంది కొవ్వు కలిపిన ఛాయలు అసలే లేవని పేర్కొంది. భోలే బాబా డెయిరీ పాలు, నెయ్యి సేకరించిన దాఖలాలే లేవనీ, మొత్తం కల్తీ కృత్రిమ నెయ్యి తతంగమేనని దీంతో స్పష్టమయ్యింది. ఇదే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్న రీతిలో ఎగిరి గంతేసిన వైసిపి నేతలైతే జగన్‌తో సహా తమ తప్పే లేనట్టు మాట్లాడుతున్నారు. ప్రాయశ్చిత్త హోమాలు, ఆలయ సందర్శనలు చేపట్టారు. ఫ్లెక్సీల పంచాయితీలు తిట్ల స్థాయికి దిగజారుతున్నాయి. నెయ్యిలో కొవ్వు లేదన్నది నిజమేగానీ, అందులో రసాయనాలు కలిపి నెయ్యి పేరిట 200 కోట్ల రూపాయల పైన సరఫరా చేయడం మాత్రం నిజం అన్నది ఇక్కడ గమనించాలి. కల్తీ జరిగిందన్నది కూడా నిజం. ఎవరు అధికారంలో ఉన్నా తిరుమలలో దారుణాలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ రాజకీయ విమర్శలను పరాకష్టకు చేర్చాయి. చివరాఖరుకు దాడుల వరకు వెళ్లాయి. ఇలాంటివి జరగడం సరికాదు. రేపు మరోకరు అధికారం లోకి వస్తే మరిన్ని దాడులు జరగవని చెప్పలేం. అందువల్ల ఇలాంటి దాడి రాజకీయాలను తిప్పి కొట్టాల్సిందే. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

# మన సహనమే విజయానికి బాట

- విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం
- అదే ఇప్పుడు మనలను ముందుకు తీసుకెళ్లింది
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ
- ఎన్డీఏ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపీలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

# రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు
- లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకుని వచ్చారు. అయితే స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ జరగాల్సి ఉందన్నారు. చర్చల ద్వారానే సమ్యలకు పరిష్కారం దక్కుతుందని అన్నారు. నినాదాలు, ఆందోళన సరికాదని అన్నారు. అయినా విపక్షం వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. ఇక వాయిదా తీర్మనంలో కెసి వేణుగోపాల్ పలు అంశాలు ప్రస్తావించారు. నివేదించిన ఒప్పందంలో గణనీయమైన ఆర్థిక, వ్యవసాయ, వ్యూహాత్మక చిక్కులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అధికారిక పకటన చేయలేదు అలాగే పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోలేదని అన్నారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో నిబంధనలు, షరతులు దేశ ప్రజలు తెలుసుకునే హక్కు ఉందని, అదేవిధంగా ప్రభుత్వం అన్ని వివరాలను పార్లమెంట్ మరియు దేశ ప్రజల ముందు ఉంచడం అత్యవసరం అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అంశం ఆవశ్యకత, ప్రజాప్రాముఖ్యత దృష్ట్యా, ఈ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా తక్షణ చర్చకు అర్హత ఉందని పేర్కొన్నారు. భారత్– అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే స్వయంగా సోషల్‌మీడియా ద్వారా సోమవారం ప్రకటించారు. ఈ అంశంపై మంగళవారం పార్లమెంటు దద్దరిల్లింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యులు ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో, తాజాగా అమెరికాతో కుదర్చుకున్న ఒప్పందాలపై చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ఈ ఒప్పందాలపై జైరాం రమేష్ చర్చకు లేవనెత్తరు. ఈ విషయంపై రాజ్యసభ స్పీకర్ సి.పి రాధాకృష్ణన్ స్పందించి.. తరువాత చర్చిస్తామని చెప్పి.. సభను మధ్యాహ్నం 12 వరకువాయిదా వేశారు. లోకసభలోనూ ఇదే తీరు నెలకొనడంతో.. దిగువ సభ కూడా మధ్యాహ్ననికి వాయిదా పడింది. ఇకపోతే మాజీ ఆర్మీ జనరల్ ఎంఎం.నరవణెకి చెందిన ఒక పుస్తకం నుడి కొన్ని అంశాలను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం లేవనెత్తిన సంగతి తెలిసిందే. నవరణె ప్రచురించని పుస్తకం నుండి కొన్ని కోట్‌లను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీపై తేజస్వీ సూర్య చేసిన ఆరోపణలకు ప్రతిస్పందించేందుకు రాహుల్‌గాంధీ యత్నించారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడంలో సభలో గందరగోళం నెలకోంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్ననికి వాయిదా పడింది. మరోవైపు కాంగ్రెస్ నేతలు పార్లమెంటరీ పార్టీ ఆఫీస్‌లో సమావేశమయ్యారు. సోమవారం లోక్‌సభలో ప్రతిపక్ష, అధికార పక్షాల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగిన నేపథ్యంలో ఇకపై పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన ప్రశ్నలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు.

# ట్రేడ్ డీల్ పేరుతో దేశాన్ని అమ్మేశారు..

- అమెరికా ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు
- అదానీ కేసు, ఎప్‌స్టీన్ ఫైల్స్ వల్లే మోదీకి భయం పట్టుకుంది
- రైతుల రక్తాన్ని, కష్టాన్ని ధారబోశారంటూ విమర్శల వర్షం
- మోదీపై రాహుల్ గాంధీ నిప్పులు!
- లోక్‌సభలో విపక్ష నేత ఆరోపణ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్–అమెరికా మధ్య అకస్మాత్తుగా కుదిరిన వాణిజ్య ఒప్పందం (ట్రేడ్‌డీల్) పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన రాహుల్.. ఈ ఒప్పందం వెనుక భారీ కుట్ర దాగి ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై సోమవారం రాత్రి హడావుడిగా సంతకాలు చేయడంపై రాహుల్ పలు ప్రశ్నలు సంధించారు. ప్రధాని మోదీకి రెండు ప్రధాన అంశాల వల్ల భయం పట్టుకుందని ఆయన విమర్శించారు. అమెరికాలో గౌతమ్ అదానీపై కొనసాగుతున్న కేసు వాస్తవానికి ప్రధాని మోదీ ఆర్థిక మూలాలపై జరుగుతున్న దాడి అని, అందుకే మోదీ వణుకుతున్నారని రాహుల్ పేర్కొన్నారు. అమెరికా వద్ద ఉన్న ఎప్‌స్టీన్ రహస్య ఫైల్స్‌లో మరిన్ని సంచలన విషయాలు ఉన్నాయని, అవి బయటకు వస్తాయనే భయంతోనే మోదీ అమెరికా చెప్పినట్లు వింటున్నారని ఆరోపించారు. "వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించుకున్న మోదీ ఇమేజ్ అనే బెలూన్ ఏ క్షణమైనా పేలవచ్చు. ట్రంప్ ఒత్తిడి వల్ల భారతీయ రైతుల రక్తాన్ని, శ్రమను మోదీ అమ్మేస్తున్నారు" అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. అమెరికా నుంచి వస్తువుల దిగుమతిపై సుంకాలను ఎత్తివేయడం వల్ల దేశీయ వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు లోక్‌సభలో మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం. నరవణే ఆత్మకథలోని అంశాలను ప్రస్తావించేందుకు రాహుల్ ప్రయత్నించగా అధికార పక్షం తీవ్రంగా అడ్డుకున్నది. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వకపోవడం చరిత్రలో ఇదే మొదటిసారి అని రాహుల్ ధ్వజమెత్తారు. ఈ క్రమంలో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. దీనిపై స్పందించిన స్పీకర్.. ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేశారు.

# చట్టాలను పాటించకపోతే.. దేశం నుంచి వెళ్లిపోండి

## మెటాపై సుప్రీం ఆగ్రహం

**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చు' అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది సరికాదని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.

### ఏమిటీ ప్రైవసీ పాలసీ?

2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సాప్‌బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన ధర్మాసనంపై వ్యాఖ్యలు చేసింది.



# కూలి'పోయిన'.. బతుకులు!



## మొగిలిపేట శివారులో ఘోర ప్రమాదం

**అక్కడికక్కడే నలుగురు వ్యవసాయ కూలీలు మృతి**
**నీటి గుంతలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్**
**అతి వేగం, నిర్లక్ష్యమే కారణమని పోలీసులు నిర్ధారణ**
**పరారీలో డ్రైవర్ ఎర్రం శెట్టి గంగాధర్ గాలింపు చర్యలు**

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** ఇంకొద్దిసేపైతే ఇంటికి చేరుతామనుకున్న ఆ వ్యవసాయ కూలీల బతుకులు అర్థాంతరంగా కూలి'పోయాయి'.! కూలికి వెళ్లి కష్టపడి సంపాదించిన రోజు ఆదాయంతో ఇంటి దారి పట్టారు. పిల్లల ఆకలి తీర్చాలి, ఇంటి చెల్లింపులు చూసుకోవాలి అనే ఆశలతో ప్రయాణం సాగింది. కానీ ఒక్క క్షణరౌ అతి వేగం, నిర్లక్ష్యం కలిసి నాలుగు కుటుంబాల జీవితాలను చీకట్లోకి నెట్టాయి. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేటలో ట్రాక్టర్ బోల్తా పడి మహిళలు ముగ్గురు, 13 ఏళ్ల బాలిక సహా నలుగురు నిరుపేద వ్యవసాయ కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.! కంటతడి పెట్టిస్తున్న ఈ దుర్ఘటన తాలూకు వివరాల్లోకి వెళితే.. మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఉదయం వ్యవసాయ కూలి పనులకు వెళ్లిన 15 మంది కూలీలు పనులు ముగించుకుని ట్రాక్టర్‌లో ఇంటికి తిరిగి వస్తుండగా, చెరువు గట్టుపై ఉన్న రోడ్డు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. ట్రాక్టర్ నేరుగా రోడ్డు పక్కనే ఉన్న నీటి గుంతలోకి బోల్తా పడింది. క్షణాల్లోనే వాహనం కింద చిక్కుకున్న నలుగురు కూలీలు ప్రాణాలు విడిచారు.

### ఆకలి-జర్నీ.!

ఈ ప్రమాదంలో సంపంగి సాయమ్మ (42), మంగళరాపు లలిత (42), రొడ్డ వైష్ణవి (13), పెద్దిరెడ్డి గంగు (45) అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా వ్యవసాయ కూలీలే. బాలిక వైష్ణవి చదువుతో పాటు తల్లిదండ్రులకు తోడుగా కూలి పనులకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం అందరినీ కలిచివేసింది. మరో కూలీ ఎల్ల గంగు (75) తీవ్రంగా గాయపడగా, మొదట మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించి, అనంతరం జగిత్యాల జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి.

### అతి వేగం.. ఓవర్‌లోడ్..

స్థానికుల కథనం ప్రకారం ట్రాక్టర్ డ్రైవర్ ఎర్రం శెట్టి గంగాధర్ (36) అతి వేగంగా వాహనాన్ని నడిపాడని..పైగా ట్రాక్టర్‌లో అధిక సంఖ్యలో కూలీలను ఎక్కించుకోవడం ప్రమాదాన్ని మరింత తీవ్రతరం చేసిందని పేర్కొన్నారు. చెరువు గట్టుపై వంపు వద్ద అదుపు తప్పిన ట్రాక్టర్ నేరుగా నీటి గుంతలోకి దూసుకెళ్లిందని చెబుతున్నారు. పోలీసులు ఈ ఘటనకు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు.

### గ్రామంలో కంటతడి పెట్టిస్తున్న దృశ్యాలు

ఘటన విషయం తెలియగానే మొగిలిపేట గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. మృతుల ఇళ్ల వద్ద రోదనలు మిన్నంటాయి. చిన్నపిల్లలు తల్లులను పిలుస్తూ ఏడుస్తుండగా, వృద్ధ తల్లిదండ్రులు మాటలు రావడం లేదు. 'ఇన్నాళ్లు కూలి చేసి కుటుంబాన్ని పోషించారౌ ఇప్పుడు కుటుంబాలే అనాథలయ్యాయి' అంటూ గ్రామస్తులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

### మొద్దునిద్దురలో ఆర్టీఏ అధికారులు

తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్లలో కూలీలను తరలించడం సాధారణంగా మారింది. అయితే ఇవి ప్రయాణ వాహనాలు కాకపోవడంతో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుంది. గతంలో కూడా ఇలాంటి ఘటనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఓవర్‌లోడ్ ప్రయాణాలు, భద్రతా చర్యల లేమి, డ్రైవర్ల నిర్లక్ష్యం కలిసి అమాయకుల ప్రాణాలను తీస్తున్నాయి. వ్యవసాయ కూలీల రవాణాకు ప్రత్యేక భద్రతా నిబంధనలు అమలు చేయాలని, ట్రాక్టర్లలో ప్రయాణాన్ని కఠినంగా నియంత్రించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ హృదయవిదారక ఘటన తెలంగాణలో రోడ్డు భద్రత, వ్యవసాయ కూలీల భద్రతపై మరోసారి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రోజుకో చోట..పూటకో రోడ్డుప్రమాదం జరుగుతున్నా..ఆర్టీఏ అధికారులు మొద్దు నిద్ర పోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.











## బాధితులను పరామర్శించిన
# కోరుట్ల ఎమ్మెల్యే

**మెట్‌పల్లి ఆసుపత్రికి హుటాహుటిన చేరుకున్న సంజయ్**
**గాయపడిన బాధితులతో మాట్లాడి ధైర్యం**
**మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచనలు**



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** అనుకోని ప్రమాదరౌ నాలుగు కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టింది. మొగిలిపేట ట్రాక్టర్ దుర్ఘటన వార్త తెలియగానే కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ క్షణం ఆలస్యం చేయకుండా బాధితుల వద్దకు చేరుకున్నారు. ఆసుపత్రి బెడ్లపై బాధతో ఉన్న కూలీలను చూసి ఆయన మనసు కలిచిపోయింది. "మీకు నేనున్నాను" అంటూ బాధితులకు భరోసా ఇచ్చారు. మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో ట్రాక్టర్ బోల్తాపడి నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ హృదయవిదారక ఘటన విషయం తెలుసుకున్న వెంటనే కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ హుటాహుటిన మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

### బాధితులకు భరోసా - 'మెరుగైన వైద్యం అందాలి'

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలతో, వారి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### వైద్యులతో సమీక్ష.. అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచన

బాధితుల చికిత్స వివరాలను వైద్యుల నుంచి తెలుసుకున్న ఎమ్మెల్యే గారు, అవసరమైన పరీక్షలు, మందులు, ప్రత్యేక చికిత్స తక్షణమే అందించాలని సూచించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారికి జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేయాల్సిన అవసరం ఉంటే ఆలస్యం చేయవద్దని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయం, పరిహారం విషయంలో కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొగిలిపేటలో జరిగిన ఈ ట్రాక్టర్ ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని డా. సంజయ్ పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలు అసురక్షితంగా ప్రయాణించడం వల్ల ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.













## మొగిలిపేట బాధితులను పరామర్శించిన
# బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. అయితే విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు హుటాహుటిన మెట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదంలో గాయపడిన బాధితులతో మాట్లాడి వారికి భరోసా అందించారు. ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో నలుగురు వ్యక్తులు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.





## ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలి

**నేటిసాక్షి జగదేవపూర్:** జిల్లాలో గర్భస్థ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగేలా ప్రతి ఒక్కరు పని చెయ్యాలని మెడికల్ ఆఫీసర్, సిబ్బంది ఎఎన్ఎం లను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆదేశించారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల అన్ని గదులు తనికి చేశారు. ఇప్పటివరకు ఎంత ఓపి చూశారని మెడికల్ ఆరా తీశారు. వైద్య పరికరాలు మందులు సమకూర్చుకుని రోగులకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ నుండి కింది స్థాయి సిబ్బంది వరకు సమయవేళలు పాటిస్తూ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లోని గర్భస్థ మహిళల ఆరోగ్య స్థితి గతులను పర్యవేక్షణ చెయ్యాలని ప్రతి గర్భిణీ ప్రభుత్వ దవాఖానలో ప్రసవం చేసుకోవాలని ప్రైవేట్ ఆసుపత్రికి ఒక్క మహిళ కూడా వెళ్లకుండా పని చెయ్యాలని మెడికల్ ఆఫీసర్ మరియు ఏ ఎన్ ఎం లను ఆదేశించారు. అన్ని జిల్లా జనరల్ ఆసుపత్రులలో అన్ని సదుపాయాలు కల్పించాలని ఎక్కడ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ డాక్టర్ సిబ్బంది పైన యాక్షన్ తీసుకోవాల్సిందిగా డిఎం అండ్‌ఎచ్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు కార్యక్రమంలో తహసిల్దార్ నిర్మల, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, వైద్యులు సత్య ప్రకాష్, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ గణేష్, కార్యదర్శి రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దొంగల ముఠా అరెస్ట్



**నేటి సాక్షి తిరుమలాయపాలెం మెట్టు రుద్రరాజు:** తిరుమలాయపాలెం మండలంలోని చుట్టుపక్కల గ్రామంలో గత ఆరు నెలలుగా జరుగుతున్న మోటార్ల దొంగతనాల ముఠా ను అరెస్ట్ చేయడం జరిగింది. రైతుల తమ వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసుకున్న మోటర్లు అర్ధరాత్రి వేళలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈరోజు తిరుమలాయపాలెం నందు కొక్కిరేణి క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటర్లు వేసుకొని వెళ్తున్న ఆటోని ఆపి తనిఖీ చేస్తుండగా అందులో నుంచి ఒక వ్యక్తి పరారీ కాగా మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా నేరస్తులు నేరాన్ని అంగీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై కూచిపూడి జగదీష్ మాట్లాడుతూ వాహనాల తనిఖీలు భాగంగా పట్టుకున్న ఇద్దరు వ్యక్తులను విచారిస్తే వారే దొంగతనాలు చేశారని అంగీకరించారు వారి వద్ద ఉన్న ఏడు మోటర్లను రెండు సెల్ ఫోన్లు మరియు ఒక ఆటోను కూడా స్వాధీన పరుచుకొని వారిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరుస్తామని ఆయన అన్నారు. నిందితుల పేర్లు బానోత్ సురేష్ బానోత్ సుమన్ వీరిద్దరూ మరిపెడ మండలం చోక్ల తండ గ్రామానికి చెందినవారు పరారీలో ఉన్న వ్యక్తి పేరు గుగులోత్ నవీన్ బచ్చోడు తండా గ్రామానికి చెందిన వ్యక్తిగా విచారణలో భాగంగా తెలిసింది.

## అతివేగమే బలితీసుకుంది!

**చెట్టును ఢీకొన్న బైక్ యువకుడు మృతి**

**స్నేహితుడికి తీవ్ర గాయాలు**

**నేటి సాక్షి - మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాం కాలనీకి చెందిన కేతావత్ ప్రవీణ్ (23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

**కోరుట్లకు వెళ్తుండగా ప్రమాదం**

సోమవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో కేతావత్ ప్రవీణ్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై స్నేహితుడు జలిగం వెంకటేష్‌ను వెనుక కూర్చోబెట్టుకుని పని నిమిత్తం కోరుట్లకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఆరపేట శివాలయం సమీపానికి చేరుకోగానే అతివేగంగా బైక్ నడపడంతో నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది.

**ప్రవీణ్ మార్గమధ్యలో మృతి**

ఈ ప్రమాదంలో ఇద్దరూ బైక్‌తో సహా కిందపడిపోయి తీవ్ర రక్తగాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రి, మెట్‌పల్లికి తరలించగా ప్రవీణ్ మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన జలిగం వెంకటేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు ప్రవీణ్ భార్య కేతావత్ సురేఖ (23), ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

# మార్పు కోసమే రాజకీయం

- యువతకు పట్టం కట్టండి
- కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి కంజర్ల రేణుక
- డివిజన్‌లో ముమ్మర ప్రచారం
- కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి



**నేటి సాక్షి, కరీంనగర్ టౌన్:** రాజకీయాల్లో మార్పు రావాలంటే కొత్త తరానికి, యువతకు అవకాశం ఇవ్వాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి కంజర్ల రేణుక పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ.. తనను ఒక అభ్యర్థిగానే కాకుండా, డివిజన్ బిడ్డగా, అక్కాచెల్లిగా భావించి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం తన ప్రథమ ప్రాధాన్యతని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ సమగ్ర అభివృద్ధి సాధ్యపడాలంటే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. యువతకు, కొత్త వారికి రాజకీయాల్లో స్థానం కల్పిస్తే కొత్త ఆలోచనలతో అభివృద్ధి జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో డివిజన్ లోని మహిళలు, యువకులు మరియు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని రేణుకకు తమ మద్దతు ప్రకటించారు.

## కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉండాలి

**నేటి సాక్షి, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల సకాలిక కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, మెప్మా అధికారులు పాల్గొని సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసే పంట కొనుగోలు కేంద్రాలు రైతుల వద్ద నుండి మద్దతు ధరకు సురక్షితంగా పంటలను కొనుగోలు చేస్తాయని తెలిపారు. పత్తి పంట దిగుబడిని అంచనా వేసి, కొరకు సరైన ఏర్పాటు చేయాలని, రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు నిర్వహించాలన్న సూచన ఇచ్చారు. జిల్లాలో 1.23 లక్షల ఎకరాలలో పత్తి సాగు జరుగుతుందని, 2 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉన్నందున, రైస్ మిల్లులకు సరైన సామర్థ్య కల్పించాలన్నారు. పంట విక్రయించేందుకు వచ్చే రైతులకు టార్పాలిన్లు, గోనె సంచులు, తేమ, తూకం యంత్రాలు, మౌలిక సదుపాయాలు మరియు హమాలీల సరిపడా ఏర్పాటు ఉండేలా చూడాలని, కేంద్రాల ఏర్పాట్లలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హత గల రైతులకు అందించడం కూడా ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

- తహసీల్దార్ శ్రీనివాస్ క్రీడాకారులను అభినందించారు



**నేటి సాక్షి, ధర్మారం:** చీఫ్ మినిస్టర్ (సీఎం) కప్ క్రీడల భాగంగా ధర్మారం మండలం నందిమేడారం ప్రాంతంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. సుమలత, మండల విద్యాధికారి పి. ప్రభాకర్ హాజరయ్యారు. గత రెండు రోజులుగా కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించబడ్డాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, మండల టీములను ఎంపిక చేసి మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో క్రీడల్లో పాల్గొనడం అత్యంత ముఖ్యమని, గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఎంపీడీవో సుమలత జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో కూడా క్రీడలలో మంచి ప్రతిభ చూపి, మండలానికి గౌరవం తెచ్చుకోవాలని సూచించారు. ఎంఈఓ ప్రభాకర్ ప్రతి క్రీడాకారుడు నిరంతరం సాధన చేయడం ద్వారా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందగలరని, జాతీయ స్థాయిలో ఆడే అవకాశాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్, వ్యాయామ ఉపాధ్యాయులు టీ. సౌజన్య, ఎన్. శ్రీనివాస్, గౌతమ్, బి. కొమరయ్య, రాజశేఖర్, సురేష్, నర్మదా, పుష్ప, నమిత, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాలుగు దశాబ్దాల నిబద్ధతకు గుర్తింపు ఇదా.?

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపు వివాదం'పై జీవన్ రెడ్డి ఆవేదన, కార్యకర్తల హక్కుల కోసం పోరు



**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య) :** జగిత్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తి, విభేదాలు చోటుచేసుకున్నాయి. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్ రెడ్డి ఇందిరా భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తన ఆవేదనను బయటపెట్టారు. 1984 నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణతో పనిచేస్తూ, రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించిన తనకు ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలకు అండగా నిలవడం తన బాధ్యత అని, బలోపేతం కోసం పేర్లు ప్రతిపాదించడమే తప్పా అని నిలదీశారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో చర్చలు, గాంధీ భవన్ ఆహ్వానంపై ఆగ్రహం**

జీవన్ రెడ్డి మరింత ఆగ్రహంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో మున్సిపల్ ఎన్నికల టికెట్లపై చర్చించడం క్రమశిక్షణ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపు చట్టం కింద నోటీసులు ఎదుర్కొన్న ఎమ్మెల్యే, స్పీకర్‌కు ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని అఫిడవిట్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిని గాంధీ భవన్‌లో అంతర్గత సమావేశానికి ఆహ్వానించడం సమంజసమా అని విమర్శించారు. ఇది పార్టీలోని నిజమైన కార్యకర్తలకు వెన్నుపోటు పోలేని అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**జగిత్యాలలో కాంగ్రెస్ చరిత్ర, కార్యకర్తల నిరాశ**

జగిత్యాలలో 2019 మినహా అన్ని మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగిరిందని జీవన్ రెడ్డి గుర్తుచేశారు. టీఆర్ఎస్ పాలనలో పదేళ్లు పోరాటం చేసిన కార్యకర్తలు ఇప్పుడు పక్కకు నెట్టబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీవితంలో ఒక్కసారి కూడా కాంగ్రెస్ జెండా పట్టని వారికి బీ–ఫారాలు ఇవ్వడం వల్ల కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొందని వివరించారు. 50 వార్డుల్లో కనీసం 40 గెలుస్తామనే విశ్వాసం ఉన్నప్పటికీ, తుది జాబితాలో చేర్పులు–మార్పులు ఎలా జరుగుతున్నాయో స్పష్టత లేదని విమర్శించారు.

**రాయికల్‌లో ఏకాభిప్రాయ జాబితా విఫలం, అవకాశవాదులకు ప్రాధాన్యం**

రాయికల్ మున్సిపాలిటీలో ఏకాభిప్రాయంతో జాబితా ఇచ్చినా, సగానికి పైగా ఇతరులకు బీ–ఫారాలు ఇవ్వడంతో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని జీవన్ రెడ్డి తెలిపారు. పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల హక్కులు కాలరాస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతుంటే, ఇక్కడ అవకాశవాదులకు ప్రాధాన్యం ఇవ్వడం ఏ సిద్ధాంతమని ప్రశ్నించారు.

**కార్యకర్తలతోనే నిర్ణయం**

ఈ అన్యాయాన్ని అఖిల భారత కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్తానని జీవన్ రెడ్డి ప్రకటించారు. తన వ్యక్తిగత విషయాల కోసం కాదు, కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తల హక్కుల కోసమే మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. చివరగా, తన భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలే నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. నిజమైన కార్యకర్తకు టికెట్ వస్తే వ్యతిరేకంగా ప్రచారం చేయనని, అన్యాయం జరిగితే మౌనంగా ఉండబోనని తేల్చిచెప్పారు. పార్టీ సింబల్ కేవలం గుర్తింపు మాత్రమేనని, కార్యకర్తల కోసం ఇంటింటికీ ప్రచారం చేస్తానని ఆయన ఘనంగా ప్రకటించారు. కాంగ్రెస్‌లో ఉన్నది ఒకే పడవ అని, ఈ సంక్షోభానికి కాలమే పరిష్కారం చూపుతుందని తన ప్రసంగాన్ని ముగించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737





ఫిబ్రవరి 5న బెంగళూరుతో ఫైనల్

# ఫైనల్లో ఢిల్లీ

## గుజరాత్‌పై ఘన విజయం

ఎలిమినేటర్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలుపు

### షఫాలీ, లిజెల్ లీ మెరుపు ఆరంభం.. బెత్ మూనీ పోరాటం వృథా

**వడోదర, ఫిబ్రవరి 3:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మంగళవారం వడోదర వేదికగా జరిగిన కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టును 7 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించి, వరుసగా నాలుగోసారి ఫైనల్‌లో అడుగుపెట్టింది. అటు బౌలింగ్‌లోనూ, ఇటు బ్యాటింగ్‌లోనూ సమష్టిగా రాణించిన ఢిల్లీ.. గుజరాత్‌కు ఏ దశలోనూ కోలుకునే అవకాశం ఇవ్వలేదు.



**మూనీ పోరాడినా.. భాగస్వామ్యాలు కరువు**

టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ వ్యూహం ఫలించింది. బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జెయింట్స్ ఆరంభం నుంచే తడబడింది. ఓపెనర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. అయితే గుజరాత్ కెప్టెన్ బెత్ మూనీ (62 నాటౌట్) ఒక వైపు వికెట్లు పడుతున్నా.. బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడింది. ఆమెకు జార్జియా వేర్‌హామ్ (35) నుంచి కాస్త సహకారం లభించింది. వీరిద్దరూ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ ఢిల్లీ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో గుజరాత్ భారీ స్కోరు చేయలేకపోయింది. ఢిల్లీ బౌలర్లలో చినెల్ హెన్రీ 3 వికెట్లు పడగొట్టి గుజరాత్ పతనాన్ని శాసించగా, నందని శర్మ 2 వికెట్లతో సత్తా చాటింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో గుజరాత్ 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు మాత్రమే చేయగలిగింది.

**షఫాలీ, లిజెల్ లీ మెరుపులు..**

169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఛేదనను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, లిజెల్ లీ గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. పవర్ ప్లే ఓవర్లలో ఫోర్లు, సిక్సర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 89 పరుగులు జోడించి విజయానికి బలమైన పునాది వేశారు. లిజెల్ లీ 43 పరుగులు చేయగా, షఫాలీ వర్మ 31 పరుగులతో మెరిసింది. వీరిద్దరూ అవుటైన తర్వాత కూడా ఢిల్లీ జోరు తగ్గలేదు.

**మధ్యలో జెమీమా క్లాస్..**

ఓపెనర్లు ఇచ్చిన ఆరంభాన్ని మిడిలార్డర్ బ్యాటర్లు జెమీమా రోడ్రిగ్స్, లారా వోల్వార్డ్ చక్కగా కొనసాగించారు. జెమీమా 41 పరుగులతో క్లాస్ ఇన్నింగ్స్ ఆడగా, లారా వోల్వార్డ్ 32 పరుగులతో నాటౌట్‌గా నిలిచి మ్యాచ్‌ను ముగించింది. గుజరాత్ బౌలర్లు ఏ దశలోనూ ఢిల్లీ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టలేకపోయారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం 15.4 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 169 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది.

**ఫైనల్ ఫైట్ అప్పుడే..**

ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఇప్పటికే ఫైనల్ చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఫిబ్రవరి 5న (గురువారం) జరిగే తుది పోరులో ఢిల్లీ తలపడనుంది. టైటిల్ కోసం ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.



## భారత్ దయ మీదే పాకిస్తాన్ బతుకు

**నిజం ఒప్పుకున్న పాక్ మాజీ ఛైర్మన్**

**స్పోర్ట్స్ డెస్క్, ఫిబ్రవరి 04 :** పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆర్థిక పరిస్థితిపై ఆ దేశ మాజీ ఛైర్మన్, మాజీ క్రికెటర్ రమీజ్ రాజా సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ క్రికెట్ మనుగడ పూర్తిగా భారత్ డబ్బులపైనే ఆధారపడి ఉందని పరోక్షంగా అంగీకరించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పీసీబీకి వచ్చే ఆదాయంలో సగానికి పైగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచే వస్తుందని రమీజ్ రాజా తెలిపారు. అయితే ఇక్కడ అసలు విషయం ఏంటంటే.. ఐసీసీకి వచ్చే మొత్తం ఆదాయంలో దాదాపు 90 శాతం డబ్బు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) నుంచే వెళ్తోందని ఆయన వెల్లడించారు. ఐసీసీ ఆదాయంలో భారత్ పాత్ర అత్యంత కీలకమని, ఒకవేళ బీసీసీఐ నిధులు ఇవ్వడం ఆపేస్తే.. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆర్థికంగా కుప్పకూలే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. రాజకీయంగా భారత్‌తో గొడవలు పెట్టుకుంటూనే, క్రికెట్ పరంగా మాత్రం పరోక్షంగా భారత డబ్బులపై ఆధారపడటం పాక్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విశ్లేషకులు అంటున్నారు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాక్ ప్రకటించిన నేపథ్యంలో రమీజ్ రాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మ్యాచ్‌లను బహిష్కరిస్తే పాక్ అన్ని విధాలా నష్టపోతుందని ఆ దేశ మాజీలే మండిపడుతున్నారు. రమీజ్ రాజా వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. పాకిస్తాన్ ఓవరాక్షన్ చేస్తున్నా.. వారి బతుకు మాత్రం ఇండియా చేతిలోనే ఉందని కామెంట్ చేస్తున్నారు. క్రికెట్‌లో రాజకీయాలు పక్కన పెట్టి ఆటపై దృష్టి పెడితే మంచిదని హితవు పలుకుతున్నారు.

## తారాజువ్వలా ఇషాన్ కిషన్

**గత 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టిన ఇషాన్**

**టి20 ప్రపంచకప్‌లో ఓపెనర్‌గా బరిలోకి!?**

**అభిషేక్ తో ఇన్నింగ్స్ ప్రారంభించే చాన్స్**

టి20 ప్రపంచకప్ 2026 వచ్చే శనివారం ఆరంభం కానుంది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టి20 ప్రపంచకప్ జరగనుంది. ఈసారి మెగా టోర్నీలో పాల్గొనే జట్ల సంఖ్య పెరిగింది. మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. భారత్ గ్రూప్ 'ఎ'లో ఉంది. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, అమెరికా, పాకిస్తాన్ జట్లు కూడా ఉన్నాయి. ఈ టి20 ప్రపంచకప్ జట్టులో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో భారత జట్టు బరిలోకి దిగుతోంది. 2007లో టి20 ప్రపంచకప్ మొదటిసారి జరగ్గా.. టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. ఇక ఆ తర్వాత 2024లో టి20 ప్రపంచకప్ నెగ్గింది. ప్రస్తుతం భారత జట్టు పటిష్టంగా ఉంది. టి20 ప్రపంచకప్ ముందు ఒక బ్యాటర్ ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. ఇటీవలె న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ రెచ్చిపోయాడు. తిలక్ వర్మ గాయం కారణంగా ఆ సిరీస్‌కు దూరమయ్యాడు. ఫలితంగా భారత జట్టుకు దూరమయ్యాడు. దాంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్ తుది జట్టులోకి వచ్చాడు. మొత్తం 4 మ్యాచ్‌ల్లోనూ అదరగొట్టాడు. ఒక సెంచరీ.. మరో అర్ధ సెంచరీ బాదాడు.ఇక అదే సమయంలో సంజూ సామ్సన్ పేలవ ప్రదర్శన చేశాడు. ఫలితంగా ఫిబ్రవరి 7 నుంచి ఆరంభమయ్యే టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు సూపర్ ఫామ్‌లో ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచింది. ఇప్పటికే అభిషేక్ శర్మ రూపంలో టీమిండియాకు పవర్ ఫుల్ ఓపెనర్ ఉన్నాడు. అతడికి ఇషాన్ తోడైతే ప్రపంచకప్‌లో టీమిండియాను ఆపడం ఎవరి తరం కాదు. 2023లో ఇషాన్ కిషన్ తారాజువ్వలా దూసుకొచ్చాడు. ఆ ఏడాది జరిగిన ఆసియా కప్‌లో అదరగొట్టాడు. దాంతో వన్డే ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. అయితే అతడికి ప్లేయింగ్ ఎలెవెన్‌లో అవకాశాలు రాలేదు. అనంతరం అతడు తీసుకున్న తొందరపాటు నిర్ణయాల వల్ల రెండేళ్లపాటు ఆటకు దూరమయ్యాడు. అయితే 2025 నుంచి అతడి ఆటతీరు మారింది.గతేడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. సంచరీల మీద సెంచరీలు బాదాడు. తన జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టాడు. అనంతరం జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కూడా రాణించాడు. ఫలితంగా అతడికి బీసీసీఐ నుంచి పిలుపొచ్చింది. బ్యాకప్ వికెట్ కీపర్‌తో పాటు బ్యాకప్ ఓపెనర్‌గా అతడిని తీసుకున్నారు.ఇక కివీస్‌తో జరిగిన టి20 సిరీస్‌లో సంజూ సామ్సన్ విఫలం కావడం.. ఇషాన్ కిషన్ రెచ్చిపోవడంతో టీమిండియా ప్లేయింగ్ ఎలెవెన్ సమీకరణాలు మారిపోయాయి. టి20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.



## డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్

**సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడి**




మహిళల క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో సీఎస్‌కే ఫ్రాంచైజీ డబ్ల్యూపీఎల్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. తమిళనాడులో జరిగిన 'ఇన్వెస్ట్ ఇన్ తమిళనాడు' సదస్సులో సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మహిళల క్రికెట్‌లో పెట్టుబడులు పెట్టడమే తమ మొదటి లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తుల్లో మహిళల క్రికెట్? జట్టులో పెట్టుబడులు పెట్టడానికి ఫ్రాంచైజీకి స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఫ్రాంచైజీ దీర్ఘకాలిక ప్రణాళికల గురించి అడిగినప్పుడు విశ్వనాథన్? ఇలా అన్నారు. "ప్రస్తుతమే ఈ నిర్ణయం అమల్లోకి రాకపోయినా, భవిష్యత్తులో సీఎస్‌కే తన పరిధిని విస్తరించనుంది. అందులో తొలి ప్రాధాన్యం మహిళల క్రికెట్‌కే ఉంటుంది. కాలక్రమేణా ఇతర క్రీడల్లో కూడా సీఎస్?కే అవకాశాలను అన్వేషించవచ్చు." అని కాశీ విశ్వనాథన్ తెలిపారు. ప్రస్తుతం ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఐదు జట్లు మాత్రమే ఉన్నాయి. అవి ముంబయి, బెంగళూరు, దిల్లీ, గుజరాత్, ఉత్తర్?ప్రదేశ్. అయితే చెన్నై, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఇప్పటివరకు మహిళల లీగ్‌లోకి ప్రవేశించలేదు.

## సరికొత్త చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ



అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. తన కెరీర్‌లో ఈ అరుదైన మైలురాయిని అందుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు టీమిండియా ఓపెనర్ స్మృతి మంధానకు వన్డే ర్యాంకింగ్స్‌లో నిరాశ ఎదురైంది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ అద్భుత ప్రదర్శన చేసింది. కేవలం 20 పరుగులు ఇచ్చి ఒక కీలక వికెట్ పడగొట్టడంతో పాటు పొదుపుగా బౌలింగ్ చేసింది. ఈ ప్రదర్శనతో ఆమెకు 737 రేటింగ్ పాయింట్లు లభించాయి. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ అనాబెల్ సదర్‌ల్యాండ్ (736)ను ఒక్క పాయింట్ తేడాతో వెనక్కి నెట్టి దీప్తి అగ్రస్థానానికి చేరుకుంది. 2025 వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్?గా నిలిచిన దీప్తి, ఇప్పుడు టీ20ల్లోనూ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వరుస సెంచరీలు బాది 820 రేటింగ్ పాయింట్లతో నంబర్-1 స్థానానికి చేరుకుంది. దీనితో స్మృతి 811 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయింది. అయితే టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మాత్రం స్మృతి మూడో స్థానంలో కొనసాగుతూ తన సత్తా చాటుతోంది. టీ20 బ్యాటింగ్ విభాగంలో జెమీమా రోడ్రిగ్స్ భారీగా పుంజుకుంది. శ్రీలంకపై 44 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా ఎంపికైన జెమీమా, ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం టీ20 బ్యాటింగ్ టాప్-10లో స్మృతి మంధాన (3), జెమీమా రోడ్రిగ్స్ (9), షెఫాలీ వర్మ (10) ముగ్గురు భారత క్రీడాకారిణులు ఉండటం విశేషం. భారత పేసర్ అరుంధతి రెడ్డి కూడా తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంది. ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 36వ ర్యాంకుకు చేరుకుంది. ఇక ఆల్‌రౌండర్ విభాగంలో దీప్తి శర్మ మూడో స్థానంలో ఉండగా, వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. సౌతాఫ్రికా ప్లేయర్ సునే లూస్ కూడా బ్యాటింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది.



## టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ జోరు.. పార్ట్ 2, పార్ట్ 3లతో రాబోతున్న భారీ సినిమాలు!

ఒకప్పుడు సినిమా అంటే ఒక పార్ట్‌తో ముగిసిపోయే కథ. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తెలుగు ప్రేక్షకులు ఎక్కువగా వినని "సీక్వెల్" అనే పదం ఇప్పుడు ఇండస్ట్రీలో అత్యంత వినిపిస్తున్న మాటగా మారింది. ఒక హిట్ సినిమా వస్తేడ దానికి రెండో భాగం, మూడో భాగం తీసే ట్రెండ్ వేగంగా పెరుగుతోంది. దర్శకులు, హీరోలు, నిర్మాతలు అందరూ ఇప్పుడు సీక్వెల్స్‌పైనే దృష్టి పెడుతున్నారు. ప్రేక్షకుల్లోనూ అదే ఆసక్తి కనిపిస్తుండటంతో ఇది ఇండస్ట్రీలో ఓ కొత్త ట్రెండ్‌గా మారింది. ఫ్యామిలీ ఎమోషన్‌తో కూడిన క్రైమ్ థ్రిల్లర్‌గా 'దృశ్యం' సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. వెంకటేష్ నటించిన 'దృశ్యం', 'దృశ్యం 2' రెండూ సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు 'దృశ్యం 3' కోసం సిద్ధమవుతున్నారు. మలయాళ వెర్షన్ ఇప్పటికే పూర్తయి విడుదలకు రెడీగా ఉండగా, హిందీ వెర్షన్ షూటింగ్ దశలో ఉంది. రెండో భాగం ముగిసిన దగ్గర నుంచే మూడో భాగం ప్రారంభమవుతుందని సమాచారం. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈ ఏడాది రెండు భారీ సీక్వెల్స్‌తో రానున్నాడనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అవే 'కల్కి 2', 'సలార్ 2'. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్‌లో బిజీగా ఉన్న ప్రభాస్‌డ వాటి తర్వాత 'కల్కి 2'ను మొదలు పెట్టి, ఆపై 'సలార్ 2'పై దృష్టి పెట్టనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాతే 'సలార్ 2' పట్టాలెక్కే అవకాశం ఉంది.ఎన్టీఆర్ కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన 'దేవర'కు సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'దేవర 2' స్క్రిప్ట్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని సమాచారం. యంగ్ హీరో తేజ సజ్జ కూడా సీక్వెల్స్ రేసులో ముందంజలో ఉన్నాడు. 'జాంబిరెడ్డి 2', 'జై హనుమాన్', 'మిరాయ్ 2' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. 'జై హనుమాన్'లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి కీలక పాత్ర పోషించనున్నాడనే వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. చిన్న సినిమాల సీక్వెల్స్ కూడా రేసులో ఉన్నాయి. 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ 'జుచీజు రిపీట్' పేరుతో రాబోతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వచ్చిన 'మ్యాడ్' సిరీస్ ఇప్పటికే రెండు భాగాలతో విజయం సాధించగా, ఇప్పుడు 'మ్యాడ్ జూనియర్స్' రూపొందుతోంది. హారర్ థ్రిల్లర్ 'పొలిమేర 3'ను పాన్ ఇండియా స్థాయిలో తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి మాత్రమే కాకుండా 'పుష్ప 3', 'కార్తికేయ 3', 'టిల్లు క్యూబ్', 'కేజీఎఫ్ 3' వంటి ప్రాజెక్టులు కూడా భవిష్యత్తులో రాబోతున్నాయి. వీటిపై అధికారిక ప్రకటనలు ఆలస్యమవుతున్నాడ ప్రేక్షకుల్లో మాత్రం భారీ ఆసక్తి ఉంది. మొదటి భాగం విజయాన్ని కొనసాగించడం సీక్వెల్‌లకు పెద్ద సవాలే. కథ, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ బ్యాలెన్స్‌గా ఉంటేనే ప్రేక్షకులను ఆకట్టుకోవచ్చు. అయితే ట్రేడ్ వర్గాల అభిప్రాయం ప్రకారండ రాబోయే సీక్వెల్స్ కూడా విజయవంతమైతే టాలీవుడ్‌లో ఈ ట్రెండ్ మరింత వేగంగా విస్తరించే అవకాశముంది.

## ధనుష్ కొత్త సినిమాలో ఇద్దరు హీరోయిన్లు



తమిళ ఇండస్ట్రీలో సీనియర్ హీరోగా గుర్తింపు ఉన్న ధనుష్, వరుస సినిమాలతో దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. మంచి కాన్సెప్ట్‌తో ఎప్పుడు ప్రేక్షకులను అలరించే హీరో ధనుష్, ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియా సామి దర్శకత్వంలో కొత్త సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు ఇంకా టైటిల్ ఫైనల్ కాలేదు. ఆ 55 అనే వర్కింగ్ టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. అమరన్ లాంటి సినిమాతో సక్సెస్ అందుకున్న రాజ్ కుమార్, ధనుష్ కోసం అద్భుతమైన కథ సిద్ధం చేశాడట. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ అని ఇప్పటికే ప్రకటించారు. పోస్టర్ రిలీజ్ చేసింది చిత్రం బృందం. అటు మమ్ముట్టి స్పెషల్ రోల్ చేయబోతున్నారట.తమిళ హీరో ధనుష్, శ్రీ లీల కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమాలో మరో హీరోయిన్ కూడా ఉన్నట్లు తాజాగా ప్రకటించింది చిత్ర బృందం. సాయి పల్లవిని కూడా ఈ ప్రాజెక్టులో ఇన్వాల్వ్ చేస్తున్నారు. అంటే ఈ మూవీలో ఇద్దరు హీరోయిన్లతో హీరో ధనుష్ స్టెప్పులు వేయనున్నాడు. అయితే ఇందులో సాయి పల్లవి పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుందని టాక్ నడుస్తోంది. గతంలో ఎన్నడు లేని విధంగా ఆమెను చూస్తారట. అందుకే సాయి పల్లవిని ఆ పాత్ర కోసం మాత్రమే దర్శకుడు రాజ్ కుమార్ తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే ఇందులో మెయిన్ హీరోయిన్ సాయి పల్లవి ఉంటుందా? లేక శ్రీలీల ఉంటుందా? అనేది తెలియాల్సి ఉంది. కాగా ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీత స్వరాలు అందిస్తున్నారు. 2027లో ఈ సినిమా రిలీజ్ అయ్యే ఛాన్స్ లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా, ఉందర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ ఆధ్వర్యంలో వస్తోంది.

## ఊహించలేనన్ని ట్విస్టులతో..



చంద్రహాస్ హీరోగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ ("ఇష్టంగా" ఫేమ్) ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఈ మూవీని ఈ నెల6న గ్రాండ్‌గా రిలీజ్ చేయ-ంబోతున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు దర్శకుడు జయంత్ సి పరాన్జీ, జేడీ చక్రవర్తి, ఆది సాయి కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హీరో చంద్రహాస్ మాట్లాడుతూ,'ధృవన్ చాలా టాలెంటెడ్. ఈ చిత్రం కోసం అద్భుతమైన పాటల్ని అందించాడు. ఈ సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించిన చిన్ని, చందు, వెంకీకి, ఈ ప్రాజెక్ట్ నాకు రావడానికి కారణమైన కెమెరామెన్ శేఖర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టకుండా ఉంటుంది. లెక్కపెట్టలేనన్ని, ఊహించలేనన్ని ట్విస్ట్‌లతో అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు అలా కూర్చుని చూస్తుండిపోతారు. సంపత్ ఈ మూవీని గొప్పగా తీశారు. నన్ను బాగా చూపించారు' అని అన్నారు. 'ఈ సినిమాతో చంద్రహాస్‌కు మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నాను. ఈ మూవీని చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని ఆది సాయి కుమార్ అన్నారు. జయంత్ సి పరాన్జీ మాట్లాడుతూ,'ఈ టైటిల్‌లోనే యాటిట్యూడ్, కాన్ఫిడెన్స్, పొగరు ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం నాకుంది' అని చెప్పారు. సంపత్ రుద్ర మాట్లాడుతూ, 'నిర్మాత వెంకీ నా క్లాస్ మేట్. అతను లేకపోతే ఈ చిత్రం లేదు. చందు, చిన్ని తరువాత ఈ ప్రాజెక్టులోకి వచ్చారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఇప్పటి వరకు ఇలాంటి ఓ కమర్షియల్ చిత్రం రాలేదు. క్లైమాక్స్ చూసి అందరూ షాక్ అవుతారు. ఆ షాక్ నుంచే థియేటర్ నుంచి బయటకు వస్తారు' అని తెలిపారు. 'నాకు బుజ్జి లాంటి మంచి పాత్రను ఇచ్చిన సంపత్‌కి థ్యాంక్స్. చంద్రహాస్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. ధృవన్ మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది' అని మేఘన ముఖర్జీ చెప్పారు.

## మా పాత్రలు నవ్విస్తాయి, ఏడిపిస్తాయి



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా నుంచి ట్రైలర్ రానే వచ్చింది. హగ్గులు, ముద్దులతో ఫుల్ రొమాంటిక్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రజెంట్ నెట్టింట సందడి చేస్తుంది. ఇక ఈ ట్రైలర్ ఈవెంట్‌లో హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'యూవీ క్రియేషన్స్ నా ఫ్యామిలీ లాంటిది. ఈ బ్యానర్ లో వచ్చే ప్రతి సినిమా మాది అనుకుంటాం. డైరెక్టర్ అశ్విన్ చంద్రశేఖర్ చేయబోయే ఎన్నో మంచి చిత్రాల్లో మొదటిదిగా "కపుల్ ఫ్రెండ్లీ" రిలీజ్ కు వస్తోంది. నేను చిన్న గ్యాప్ తీసుకున్న మాట నిజమే. ఈ సారి నేను చూపించబోయే కథ ఇరవై ఏళ్ల పాటు మీకు గుర్తుండిపోవాలి అనుకుని ఈ సినిమా చేశాను. శివ అనే క్యారెక్టర్‌కు ఒక జర్నీ ఉంటుంది. ఆ జర్నీలో మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తా. శివ నెల్లూరు నుంచి వచ్చిన అబ్బాయి, మిత్ర చిత్తూరు నుంచి వస్తుంది. వాళ్లు చెన్నైలో కలుస్తారు. చెన్నైలో షూటింగ్ చేయడం బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. శివ, మిత్ర అనే పాత్రలు మిమ్మల్ని నవ్విస్తాయి, కదిలిస్తాయి. కాస్త ఏడిపిస్తాయి. "కపుల్ ఫ్రెండ్లీ" ఒక జెన్యూన్ ఇంటెన్షన్‌తో హానెస్ట్ గా చేసిన సినిమా. ఇది నా కెరీర్‌లో గుర్తుండిపోయే మూవీ అవుతుంది' అన్నారు. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తుండగా.. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

## 'ధురంధర్ 2' ఎఫెక్ట్.. వాయిదా దిశగా అడివి శేష్ 'డెకాయిట్'?




టాలీవుడ్ యువ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ'. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రం తాజాగా వాయిదా పడనుందనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. వాస్తవానికి ఈ చిత్రాన్ని మార్చి 19న ఉగాది కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే అదే సమయంలో బాలీవుడ్ భారీ ప్రాజెక్ట్ రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'తో పాటు కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రాలు కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద తీవ్ర పోటీ నెలకొంది. ఈ భారీ చిత్రాల మధ్య థియేటర్ల లభ్యత, కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో 'డెకాయిట్' చిత్రాన్ని ఏప్రిల్ 10, 2026కి వాయిదా వేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. గతంలో ఈ బాక్సాఫీస్ క్లాష్ గురించి అడివి శేష్ స్పందిస్తూ తమ సినిమా పెద్ద చేపల మధ్య ఒక 'గోల్డ్ ఫిష్' లాంటిదని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సోలో రిలీజ్ కోసం వెతకడమే శ్రేయస్కరమని టీమ్ భావిస్తోంది. షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీపై అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

## ఆలయ పూజారి మృతి


**కుటుంబాన్ని పరామర్శించిన గ్రామస్తులు**



**నేటి సాక్షి । నారాయణపేట:** నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని శ్రీ శ్రీ శ్రీ ఆది ఆంజనేయస్వామి దేవాలయం పూజారి జంగం చంద్రశేఖర్ (65) అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చంద్రశేఖర్ ఎన్నో సంవత్సరాలుగా ఆలయ పూజారిగా సేవలందిస్తూ భక్తుల అభిమానాన్ని పొందారని తెలిపారు. ఆయన ఆకస్మిక మృతి మరికల్ గ్రామానికి తీరనిలోటని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అఖిలపక్ష నాయకులు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

## కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల ప్రకటన

**బీ ఫారమ్‌లు అందజేత**



**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులను మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి మంగళవారం ప్రకటించి బీ ఫారమ్‌లు అందజేశారు.

**వార్డు వారీగా అభ్యర్థులు:**

1- కప్ప మమత, 2- శేహనాజ్ సమీర్, 3- జంగం రమేష్ గౌడ్, 4- మహమ్మద్ షరీఫ్, 5- సారిక శ్రీనివాస్ రెడ్డి, 6- గాడిపల్లి నవ్యశ్రీ, 7- మన్నెం విష్ణువర్ధన్ రెడ్డి, 8- గుగులోతు రమేష్, 9- శేరిపల్లి ఉపేందర్ రెడ్డి, 10- గౌరప స్వామి, 11- షిరీన్ బేగం, 12- వెల్దండ నర్సింహా రెడ్డి, 13- రాయగారి సంతోష్, 14- గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, 15- నక్క సంతోషి రాములు గౌడ్, 16- నాయిని సత్యలక్ష్మి యాదగిరి, 17- గాజుల భారతమ్మ చంద్రమౌళి, 18- సయ్యద్ మతిన్, 19- మునవర్ అలీ, 20- వంటేరు కొండల్ రెడ్డి.

జగిత్యాల పట్టణ

## బీఆర్ఎస్ అధ్యక్షునిగా ఆయిల్నేని

**వెంకటేశ్వర్ రావు నియామకం**




**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** భారత రాష్ట్ర సమితి (BRS) జగిత్యాల పట్టణ అధ్యక్షునిగా ఆయిల్నేని వెంకటేశ్వర్ రావును నియమించినట్లు జిల్లా BRS అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ యల్ రమణ, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. పార్టీని పట్టణ స్థాయిలో మరింత బలోపేతం చేయడంలో ఆయిల్నేని వెంకటేశ్వర్ రావు కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్వేరో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ**

**నేటి సాక్షి, జోగులాంబ గద్వాల జిల్లా:** అక్షరం, ఆర్థికం, ఆరోగ్యం అనే లక్ష్యాలతో



పేదలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దే స్వేరో సంస్థ నూతన క్యాలెండర్‌ను అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు విస్తరించి, పేద ప్రజలను విద్యాపరంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడంలో స్వేరో సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా చదువు ద్వారా పేదలకు శక్తిని అందిస్తూ, నిరంతరం వారి అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో వైస్ ప్రెసిడెంట్ రఫీ, ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హామీలతో మోసం చేసి రోడ్డున పడేశారు



- **మన్యం విష్ణువర్ధన్ రెడ్డి ఘాటు విమర్శలు**

**నేటి సాక్షి గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఆర్ అండ్ ఆర్ కాలనీ 7వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మన్యం విష్ణువర్ధన్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రత్యర్థి పార్టీలపై ఘాటు విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గుడికి గుడి, బడికి బడి ఇస్తామని నమ్మబలికి చివరకు ప్రజలను రోడ్డున పడేసి బిచ్చగాళ్లలా మార్చిందని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు సమస్యలు పట్టించుకోని నాయకులు ఇప్పుడు ఎన్నికలు రాగానే స్థానికేతరులను రంగంలోకి దించి మళ్లీ హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ కారణంగా ఆర్ అండ్ ఆర్ కాలనీలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ పూర్తి నష్టపరిహారం అందలేదని, కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్మశానవాటిక సౌకర్యం లేకపోవడంతో మరణించిన వారి అంత్యక్రియలు చెరువులు, కుంటల వద్ద నిర్వహించాల్సి వస్తోందని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసితుల సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతోనే తాను పోటీ చేస్తున్నానని పేర్కొన్నారు. ఎర్రవల్లి, సింగారం గ్రామాల ప్రజలు చేతి గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పెద్దచెరువు అక్రమ నీటి విడుదలపై తాసిల్దార్‌కు వినతి

**సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ గ్రామంలోని పెద్దచెరువులో గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా, మండల తాసిల్దార్‌కు సమాచారం ఇవ్వకుండానే అక్రమంగా నీటిని బయటకు విడుదల చేసిన ఘటనపై అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ ప్రజల దాహార్తి అవసరాలు, రైతుల సాగునీటి సమస్యలను పట్టించుకోకుండా చెరువు నీటిని విడుదల చేయడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ కాలువ పక్కన ఉన్న మోరంను ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని పేర్కొంటూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మరికల్ మండల అధ్యక్షుడు మంగలి వేణుగోపాల్, బీఆర్ఎస్ (టీఆర్ఎస్) మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య, వార్డు సభ్యుడు సురిటి చంద్రశేఖర్, నాయకులు కస్పె శ్రీనివాసులు, బాలరాజ్ గౌడ్, స్వామి, వడ్డే శ్రీరామ్, బాలకృష్ణ, రవి గౌడ్, కృష్ణయ్య, రమేష్‌తో



పాటు మరికల్ గ్రామస్తులు పాల్గొన్నారు

# కేంద్రం మొండి వైఖరి పై పోరుబాట



- **ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాల పిలుపు.**
- **సిఐటియు మండల నాయకులు బచ్చలకూర స్వరాజ్యం.అందజేత**

**నేటి సాక్షి, మునగాల:** మునగాల మండల పరిధిలోని రేపాల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కార్మిక సంఘాల ముఖ్య నాయకులు మునగాల మండల సిఐటియు అధ్యక్షులు బచ్చలకూర స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సోమపంగు జానయ్య కలిసి డాక్టర్ వినయ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను చారిత్రాత్మక విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పరిశ్రమల సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులందరూ స్వచ్ఛందంగా తరలివచ్చి తమ నిరసనను గళం వినిపించాలని నాయకులు కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ధోరణిపై తీవ్రంగా మండిపడ్డారు. కార్మికులు దశాబ్దాల కాలంగా పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. పాత కార్మిక చట్టాలను రద్దు చేసి, యజమానులకు కొమ్ముకాసే విధంగా కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం వల్ల భవిష్యత్తులో కార్మిక భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి ప్రాథమిక అంశాలను కూడా విస్మరించి, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా చట్టాలను సవరిస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కార్మికుల ఐక్యత చాటాల్సిన సమయం ఆసన్నమైందని, హక్కుల రక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని నేతలు స్పష్టం చేశారు. మునగాల మండల వ్యాప్తంగా ఉన్న కార్మికులందరూ ఫిబ్రవరి 12న విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొనాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి సమ్మె ఆవశ్యకతను వివరిస్తామని, ప్రతి కార్మిక కుటుంబం ఈ పోరాటంలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమ్మెను విజయవంతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపాలని, అప్పుడే కార్మికుల ఆకాంక్షలు నెరవేరుతాయని వారు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మూడు హరిసింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద బీమా చెల్లించగా, ఆ పథకం ద్వారా మృతుడి నామినీ అయిన భార్య మూడు ఉమాకు రూ.2 లక్షల బీమా చెక్కును తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సబ్‌లేడ్ బ్రాంచ్ మేనేజర్ షేక్ మున్న చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ షేక్ మున్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా పథకాలపై అవగాహన కలిగి ఉండి తప్పనిసరిగా బీమా చెల్లించాలని సూచించారు. ఇలా చెల్లించే బీమా అనుకోని సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు సైదులు, రాజు, క్యాషియర్లు ఉపేంద్ర, మాలతి, మెసెంజర్ గోవర్ధన్, సిఎల్ఎఫ్ కౌన్సిలర్లు కామల్ల కిరణ్ కుమార్, డి. నాగరాజు, వి. ఉమా, సిఎస్‌పి మెట్టు నవ్య, సిసి లక్ష్మి, గ్రామ దీపికలు రజిత, మెట్టు రాణి,



రాంబాయి, నాగేశ్వరి, నర్మద, ఇందిరమ్మతో పాటు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# మిత్రుడి యాదిలో బడికి సామాగ్రి వితరణ



నేటి సాక్షి, ఎండపల్లి: మండల పరిధి గుల్లకోట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన కీ.శే కాంపెల్లి దిలీప్ జ్ఞాపకార్థం సహచర పదవ తరగతి (2020-21) మిత్ర బృందం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేల విలువ చేసే పోడియం, గ్రీన్ మ్యాట్‌ను బహూకరించారు. ఈ సామాగ్రి విద్యార్థులకు బోధన కార్యక్రమాల్లో ఎంతో ఉపయోగపడుతుందని, తమ మిత్రుడు దిలీప్ జ్ఞాపకాన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిలుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు మిత్రులు పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు సామాగ్రి బహుకరించడం పట్ల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీ.శే కాంపెల్లి దిలీప్ మిత్ర బృందం, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.రమాదేవి, ఆర్.మాలతి, వి.ప్రశాంత్, ఎన్.నరేష్ కుమార్, కె.కృష్ణారెడ్డి, ఎన్. శ్రీలత, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభే విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది



- కోరుట్ల నియోజకవర్గ స్థాయి సీఎం కప్ పోటీలకు సన్నాహక సమావేశం

**నేటి సాక్షి - కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలకు సంబంధించి సన్నాహక సమావేశం సోమవారం కోరుట్ల పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని పోటీల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గంగుల నరేశం మాట్లాడుతూ, కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి ఎంపికైన విద్యార్థులు తప్పనిసరిగా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పోటీలు సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలు కోరుట్ల జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5న ఖో-ఖో, కబడ్డీ, ఫిబ్రవరి 6న వాలీబాల్, అథ్లెటిక్స్, ఫిబ్రవరి 7న చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు జరుగుతాయని వివరించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటితే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు చదువులోనూ చురుకుదనం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఈటీ సెక్రటరీ అశోక్‌తో పాటు విజయ్, మహిపాల్, శ్రీకాంత్, అజయ్, లక్ష్మణ్, దివ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# 150 ఏళ్ల పురాతన చెరువుకట్ట ధ్వంసం

- అధికారుల నిర్లక్ష్యంతో రైతుల జీవనాధారం ప్రమాదంలో



**నేటి సాక్షి - మహబూబాబాద్, :** నరసింహులపేట మండలంలోని పెద్దనాగరం స్టేజ్ పరిధి జగ్గ్య తండా గ్రామ శివారులో ఉన్న 150 ఏళ్ల పురాతన చెరువుకట్టను రాత్రివేళ జేసీబీతో ధ్వంసం చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనతో తండావాసులు, రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 107 పరిధిలో ఉన్న ఈ చెరువు ఆధారంగా సుమారు 20 మంది రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చెరువుకట్ట వల్లే తమ భూములకు నీటి సదుపాయం లభించేదని, కట్ట ధ్వంసమైతే పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఘటనపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, బానోతు భాస్కర్, బానోతు ప్రశాంత్‌లకు నోటీసులు జారీ చేసినట్లు రైతులు తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించినప్పటికీ, నోటీసులను లెక్కచేయకుండా రాత్రివేళ చెరువుకట్టను పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖలకు పలుమార్లు పిటిషన్లు ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖ మౌనం అనుమానాలకు తావిస్తోంది. అధికారుల ఆశీస్సులతోనే ఈ ధ్వంసం జరిగిందా? అనే సందేహాలు తండావాసుల్లో వ్యక్తమవుతున్నాయి. చెరువుకట్ట ధ్వంసం తమ జీవనాధారంపై దాడితో సమానమని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా దోషులపై కఠిన చర్యలు తీసుకుని, చెరువుకట్టను తక్షణమే పునర్నిర్మించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జగ్గ్య తండా రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాలు
- నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్

**నేటి సాక్షి - మెట్‌పల్లి** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు సకాలంలో గృహాలు అందించాలంటూ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు.

### పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మంజూరైన అన్ని ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేసి నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి లబ్ధిదారునికి తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇటుక, కంకర, బేస్‌మెంట్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు లబ్ధిదారులకు అనుకూలంగా ఉండేలా అధికారుల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి ధరల నియంత్రణ చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వెనుకబడి ఉంటే తక్షణమే వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

### గడువులోపు లక్ష్యాలు పూర్తి చేయాలి

లబ్ధిదారులకు కేటాయించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఇండ్ల నిర్మాణం జరగాలని, ఇందుకు అవసరమైన మేస్త్రీలు, కార్మికులను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిర్మాణ సమయంలో ఆర్థిక సమస్యలు ఎదురైతే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు దశలవారీగా నేరుగా ఆధార్ లింక్ చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని కలెక్టర్ వివరించారు.

### లబ్ధిదారులతో నేరుగా సంభాషణ

అనంతరం మార్కింగ్, బేస్‌మెంట్, స్లాబ్ లెవల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి త్వరలోనే గృహప్రవేశం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఎంపిడీవో సురేష్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్ స్థల పరిశీలన





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు తహసిల్దార్ పార్వతి తెలిపారు, మండలంలోని పెద్ద కొండా మరి గడ్డం వారి పల్లి పంచాయతీలలో గల పలు ప్రాంతాలలో సోలార్ ప్లాంట్ కోసం స్థలాన్ని పరిశీలించినట్లు ఆమె వివరించారు, 10 నుంచి 15 ఎకరాల వరకు ప్లాంట్ కోసం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్కో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



**నేటి సాక్షి - మెట్‌పల్లి:** మల్లాపూర్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన దండే నరసింహులు (46) కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నరసింహులు వృత్తి నిమిత్తం వేంపేట గ్రామంలో నివసిస్తూ పశువులను కాచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం వేంపేట గ్రామ శివారులోని వాగుకు చేపలు పట్టేందుకు వెళ్లిన నరసింహులు, కరెంట్ వైర్ ఉపయోగించి చేపలు పట్టే ప్రయత్నం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడి భార్య దండే నర్సు (35) ఫిర్యాదు మేరకు మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని సబ్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదం

### ఇద్దరికి గాయాలు





**నేటి సాక్షి న్యూస్, చౌడేపల్లి :** చౌడేపల్లి మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిపై చౌడేపల్లి వైపు వస్తున్న టూ వీలర్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బూరుగుపల్లి గ్రామానికి చెందిన దేవరాజులు (50), నవీన్ (25)లకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా గాయపడిన వారిని సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

## శివ సాయి నియామకం



**నేటి సాక్షి, గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్):** సమాచార హక్కు చట్టం సాధన సంస్థ కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన దేశరాజు శివ సాయిని నియమించినట్లు సంస్థ ఫౌండర్ నేషనల్ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా దేశరాజు శివ సాయి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం 2005లో అమల్లోకి వచ్చిందని, ఇది ప్రభుత్వ పారదర్శకత, జవాబుదారితనం పెంపొందించి అవినీతిని అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పౌరులు ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ఈ చట్టం ద్వారా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార హక్కు చట్టం సాధన సభ్యులు సుర స్రవంతి, మల్లం వెంకటేశం, ఎన్. శ్రీధర్ లు పాల్గొని నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## శుభ్రతకు ప్రత్యేక చర్యలు

### నూతన సర్పంచ్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు



**నేటి సాక్షి - మెట్‌పల్లి:** వేంపేట గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మురికి కాలువల (డ్రైనేజీల) శుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గత నెల 23వ తేదీ నుంచి ప్రతిరోజూ 15 మంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులతో గ్రామంలోని డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, డ్రైనేజీలలో చెత్త, మిగిలిన ఆహార పదార్థాలు వేయవద్దని కోరుతున్నారు. గ్రామ పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్‌తో పాటు 4వ వార్డు సభ్యుడు చంద్రచారి దశకంఠ రాజు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తరలింపు

### ఇద్దరి పై కేసు నమోదు ఎస్సై జి నరేందర్ రెడ్డి




**నేటి సాక్షి, గన్నేరువరం, బుర్ర అంజయ్య:** గన్నేరువరం మండలంలోని చొక్కారావు పల్లి గ్రామ శివారులోని బిక్కువాగు నుంచి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ మంగళవారం గన్నేరువరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గన్నేరువరం ఎస్సై జి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో డాక్టర్ ద్వారా ఇసుకను గన్నేరువరం గ్రామానికి తరలిస్తున్నట్లు గుర్తించారు వెంటనే ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ ఘటనలో ట్రాక్టర్ నడిపిన డ్రైవరు 2018 రమేష్ (గన్నేరువరం,)తో పాటు ట్రాక్టర్ యజమాని బత్తిని చంద్రశేఖర్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై జి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణా ఇసుక అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేత

- మున్సిపల్ ఎన్నికల్లో యువతకే పెద్దపీట
- కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్




**నేటి సాక్షి - కోరుట్ల( రాధారపు నర్సయ్య ):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేసే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కోరుట్ల పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, అలాగే మెట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేశారు.

### అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి - బీఆర్ఎస్ పాత్ర

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కేసీఆర్ గారి నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు, పేద, యువత, మహిళల సంక్షేమం కోసం ఎన్నో చారిత్రక నిర్ణయాలు తీసుకుని విజయవంతంగా అమలు చేసిందని పేర్కొన్నారు.

### 75 శాతం యువతకే అవకాశం

మెట్‌పల్లి, కోరుట్ల పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 75 శాతం మంది యువతకే అవకాశం కల్పించినట్లు తెలిపారు. యువతలో ఉన్న ఉత్సాహం, నూతన ఆలోచనలు, అభివృద్ధిపై ఉన్న దృఢ సంకల్పంతో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే లక్ష్యంతోనే యువతకు పెద్దపీట వేసినట్టు చెప్పారు.

### పారదర్శక పాలనకు యువతే బలం

యువత రాజకీయాల్లోకి రావడం ద్వారా స్థానిక సమస్యలపై చురుకైన స్పందన ఉంటుందని, పారదర్శక పాలనతో పాటు వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ యువతకు అండగా నిలుస్తుందని, వారికి నాయకత్వ అవకాశాలు కల్పించడమే పార్టీ విధానమని స్పష్టం చేశారు.గతంలో బీఆర్ఎస్ పాలనలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు.

### ఆదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రానున్న రోజుల్లో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలను శుభ్రంగా, సుందరంగా, అభివృద్ధి చెందిన పట్టణాలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు మరోసారి అవకాశం ఇస్తే కోరుట్ల-మెట్‌పల్లి మున్సిపాలిటీలను ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాలు
- మున్సిపల్ ఎన్నికల భద్రతపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**నేటి సాక్షి - జగిత్యాల( రాధారపు నర్సయ్య ):** రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

### ఎన్నికలలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణలో పోలీస్ శాఖ పాత్ర, ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అమలు, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, క్రిటికల్ మరియు సున్నిత ప్రాంతాలపై పర్యవేక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు ముందస్తు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### నేరస్తులు, రౌడీషీటర్లపై ముందస్తు చర్యలు

డీజీపీ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న నేరస్తులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులను గుర్తించి బైండోవర్ చర్యలు చేపట్టాలని సూచించారు.

### సున్నిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు, సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాల పరిస్థితులపై సంబంధిత అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని డీజీపీ తెలిపారు. ప్రతి అధికారి తన పరిధిలోని పరిస్థితులపై స్పష్టమైన సమాచారం కలిగి ఉండాలని సూచించారు.

### డబ్బు, మద్యం అక్రమాలకు కఠిన చర్యలు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేయాలని, డబ్బు, మద్యం తదితర ప్రలోభాలకు సంబంధించిన అక్రమ రవాణా, పంపిణీపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్‌కు ముందు మరియు పోలింగ్ రోజున అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలని తెలిపారు.

### సోషల్ మీడియాపై నిఘా

సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య వార్తలను నిరోధించేందుకు సైబర్ విభాగం ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డీజీపీ సూచించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా బందోబస్తు ఏర్పాటు చేసి, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పూర్తి భద్రత కల్పించాలని తెలిపారు.

### జిల్లా భద్రతా ఏర్పాట్లపై నివేదిక

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొని, జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు చేపట్టిన భద్రతా ఏర్పాట్ల వివరాలను డీజీపీకి వివరించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘు చందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

# మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ





- వైద్య సేవల్లో నాణ్యత పెంచాలి - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**నేటి సాక్షి - మెట్ పల్లి:** మెట్‌పల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

### వైద్య సేవలు, పరిశుభ్రతపై సమీక్ష

ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పరిశుభ్రత పరిస్థితులు, సిబ్బంది హాజరు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డులను సందర్శించి పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ఔషధ నిల్వల తనిఖీ

ఆసుపత్రిలోని ఔషధ నిల్వ గదులను కలెక్టర్ తనిఖీ చేసి, రోగులకు అవసరమైన మందులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. మందుల కొరత ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

### రోగులతో నేరుగా సంభాషణ

ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలు, చికిత్సపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి రోగికి గౌరవంతో సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.

### బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఈ తనిఖీలో మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి కో-ఆర్డినేటర్ రామకృష్ణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ సాజిద్ అహ్మద్, ఎమ్మార్వో నీత, వైద్యులు మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి





- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- బండలింగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆకస్మిక తనిఖీ

**నేటి సాక్షి - మెట్ పల్లి:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మెట్‌పల్లి మండలం బండలింగపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాల కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు.

### బోధన విధానం, హాజరు పరిశీలన

ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న బోధన విధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, మౌలిక వసతుల స్థితిగతులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాల బోధనపై ప్రశ్నలు అడిగి సెలబస్ అమలు తీరును తెలుసుకున్నారు.

### విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ

విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠాలు చదివించడంతో పాటు వారి అవగాహన స్థాయిని ప్రత్యేకంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

### గణితంలో మరింత పురోగతి అవసరం

పదో తరగతి గణితం నోట్‌బుక్‌లను పరిశీలించిన కలెక్టర్, ఈ విషయంపై విద్యార్థులు కొంత వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఇంకా పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే రైటింగ్‌పై ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో ఏమి అవ్వాలనుకుంటున్నారో అడిగి తెలుసుకుని, చదువుతో కలిగే ప్రయోజనాలను వివరించి విద్యార్థులను ప్రోత్సహించారు.

### ఖీూచీ మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి

అనంతరం వీరాూ పాఠశాలలో మూడో తరగతి ఖీూచీ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ)పై పలు ప్రశ్నలు అడిగారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు.

### సన్నబియ్యం, కిచెన్ గార్డెన్ తప్పనిసరి

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి అవగాహన కల్పించాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వినియోగించాలి, వంటకాలకు గ్యాస్ సిలిండర్లు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు వైద్య పరీక్షలు సకాలంలో నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రోజువారీ వంటకాలు అందేలా పర్యవేక్షణ పెంచాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి కె. రాము, ఎంఈవో చంద్రశేఖర్, మండల తహసిల్దార్ నీత, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బి.ఎల్.ఓలు విధులను జాగ్రత్తగా నిర్వహించాలి





- జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత

**నేటి సాక్షి - జగిత్యాల (రాధారపు నర్సయ్య):** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఈ ప్రక్రియలో బి.ఎల్.ఓల పాత్ర అత్యంత కీలకమని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని ఎస్‌వీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఓటరు జాబితా సవరణపై సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని బి.ఎల్.ఓలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన 18 సంవత్సరాలు నిండిన వారందరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని ఆమె సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని తెలిపారు. ఓటర్ల వయస్సు, చిరునామా వంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఫోటోలు మరియు ఆధార పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ఫారం-6, 7, 8లను సక్రమంగా స్వీకరించి, అందిన దరఖాస్తులను సకాలంలో ప్రాసెస్ చేయాలని తెలిపారు. డూప్లికేట్ నమోదులు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని అన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటా అప్‌లోడ్ చేసి పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. పట్టణ, గ్రామ, వార్డు స్థాయిలో పర్యవేక్షణ పెంచి ప్రత్యేక డ్రైవ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనదని గుర్తు చేస్తూ ఎన్నికల స్వచ్ఛతకు అందరూ సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి నివేదికలను సమయానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రాం మోహన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ వరందన్, బి.ఎల్.ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి





- సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్

**నేటి సాక్షి, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు (బాలికలు), లక్షెట్టిపేట, జన్నారం గిరిజన ఆశ్రమ పాఠశాలలు (బాలూరు)లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ మంగళవారం పరిశీలన నిర్వహించారు. వారు పాఠశాలల విద్య, వైద్యం, భోజనం, ఇతర సదుపాయాలపై అధికారులు అందించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో సమావేశమై, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను, మెనూ ప్రకారం భోజనం పంపిణీ, ఆహారం రుచి, మెనూ అమలు పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు అధికారి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, ప్రతి రోజు పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని, సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. వసతి గృహ పరిసరాల్లో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్చుకోవాలి అని ఉపాధ్యాయులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ అండగా ఉంటుంది

### మంత్రి వివేక్ వెంకటస్వామి



నేటి సాక్షి మంచిర్యాల జిల్లా: చెన్నూరు మున్సిపల్ కౌన్సిలర్ పోటీకి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు టికెట్ ఆశించి భంగపడ్డ ఆశవాహులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇవ్వాళ మున్సిపల్ 18 వార్డుల అభ్యర్థులకు పార్టీ బి ఫామ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురావేసేందుకు పార్టీ శ్రేణులు సంయుక్తంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టికెట్ రాని వారికి పార్టీ లో సమూచిత స్థానం కల్పివ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# విద్యార్థి విజయకేతనం



**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** ఎస్.జి.ఎఫ్.అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించిన మైనారిటీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ కళాశాల విద్యార్థి ఏ.హర్షవర్ధన్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్ లోని లాలాగూడ లో జరిగిన అండర్-19 బాలుర విభాగంలో 61కేజీల బరువులో బ్రాంజ్ మెడల్ సాధించడం జరిగింది. దీనికి కళాశాల ప్రిన్సిపల్ ఎన్. మహేందర్ విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ అంజయ్య ను ప్రత్యేక అభినందనలు తెలపడం జరిగింది. కళాశాల అధ్యాపక బృందం, కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్, నవీన్ కుమార్, నిజాముద్దీన్, తిరుపతి, జగన్ మహేష్, జ్యోతి, కళ్యాణి, సరిత, ఇమ్రాన్, అపర్ణ, విజయ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

# బస్సు సౌకర్యం కల్పించండి

### జనగామ డిపో మేనేజర్ కుతిగుల్, రాంనగర్ గ్రామస్తులు విజ్ఞప్తి




**నేటిసాక్షి : జగదేవపూర్:** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్, రాంనగర్ గ్రామాల మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం గ్రామాల సర్పంచ్ రజిత పరశురాం, సర్పంచ్ రజిత మల్లేశం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతి తరపున జనగామ జిల్లా డిపో ఆర్టీసీ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. జనగామ ఆర్టీసీ డిపో నుండి ఆర్టిసి బస్సులు నిత్యం హైదరాబాద్ వెళ్లుతాయి. ప్రయాణికుల సౌకర్య నిమిత్తం జనగామ నుండి బచ్చన్నపేట సిద్దిపేట జిల్లా కొమురవెల్లి కొండపోచమ్మ జగదేవపూర్ మండలం వట్టిపల్లి, మునిగడప, తిగుల్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మీదుగా జేబీఎస్ వెళ్లే రవాణా సౌకర్యం ఉంది. కావున రాంనగర్, తిగుల్ గ్రామాల మీదుగా బస్సు వేయడం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తోలుగుతాయాని, విద్యార్థులకు కూడా ఇబ్బందులు ఉండవని చెప్పారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి, రూట్ మ్యాప్ పరిశీలించి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిగుల్ నర్సాపూర్ మాజీ సర్పంచ్ కప్పర రాంప్రసాద్ రావు, తిగుల్ మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య, గ్రామ నాయకులు కరుణాకర్ రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.